VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com




# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 26 విశాఖపట్నం, 31 అక్టోబరు 2023 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ముఖ్యమంత్రి



### రైలు ప్రమాద క్షతగాత్రులకు పరామర్శ

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** రైలు ప్రమాద బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి హామీ ఇచ్చారు. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంటకాపల్లి రైలు ప్రమాద బాధితులను ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆసుపత్రి వార్డుల్లో ఉన్న మొత్తం 29 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రతీ ఒక్కరి వద్దకూ వెళ్లి ఆప్యాయంగా పరామర్శించారు. రైలు ప్రమాదం జరిగిన తీరు, వైద్య సదుపాయంపై ఆరా తీశారు. వారిని ఓదార్చారు. పూర్తిగా కోలుకొనే వరకు వైద్య సహాయాన్ని అందిస్తామని అన్నారు. ప్రతీఒక్కరూ వీలైనంత త్వరగా కోలుకొనే విధంగా, మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు.

అనంతరం మృతుల కుటుంబ సభ్యలను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్నివిధాలా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రమాద సంఘటనను వివరిస్తూ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి తిలకించారు. ప్రమాదం జరిగిన తీరును, తీసుకున్న సహాయ చర్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, రైల్వే ఉన్నతాధికారులు సిఎంకు వివరించారు.

(మిగతా 2లో)

## రైల్వే మంత్రికి జీవీఎల్ లేఖ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** వాల్తేర్ రైల్వే డివిజన్‌లోని అలమండ మరియు కంటకపల్లె మధ్య విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో కనీసం 14 మంది మృతి చెందిన ఘోర రైలు ప్రమాదంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, బిజెపి రాజ్యసభ ఎంపి శ్రీ జీవీఎల్ నరసింహారావు ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో కేవలం ఐదు నెలల వ్యవస్థలో రెండు పెద్ద రైలు ప్రమాదాలు సంభవించటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఏడాది జూన్‌లో ఒడిశాలోని బహనాగ బజార్ స్టేషన్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కు జరిగిన ఘోర ప్రమాదంలో

280 మంది ప్రయాణికులు మరణం చెందిన విషయం గుర్తు చేస్తూ, ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లోని ప్రధాన హౌరా-చెన్నై లైన్ లోనే ఆ ప్రమాదం కూడా జరిగిందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు.

"విశాఖపట్నంలో నివసిస్తున్న పార్లమెంటు సభ్యునిగా మరియు ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ యొక్క జోనల్ రైల్వే యూజర్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా,

(మిగతా 2లో)

### పార్వతీపురం పట్టణంలో
## ఏనుగు సంచారం







### 10 రోజుల్లో పద్మావతి
## అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు




### ఆశ్చర్యపోతున్న
## అటవీ అధికారులు




# పత్రికలకు చిన్నా-పెద్దా భేదం లేదు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పత్రికలకు నాణ్యతా, నిపుణత, నిజాయితీ ఉండాలి గాని వాటికి పెద్దా-చిన్నా తారతమ్యం లేదని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు అన్నారు. విశాఖ సమాచారమ్ తెలుగు దినపత్రిక 33వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విశాఖ సమాచారమ్ నైతికంగాను, సామాజికంగాను, వృత్తిపరంగాను ఎన్నో విజయాలు సాధించిందని, నిబద్ధత గల పత్రిక అని, 33 సంవత్సరాలు ఏకధాటిగా ప్రచురించబడుతూ ప్రజల్లో మంచిపేరు కలిగి ఉన్నందుకు పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, పాఠకులకు అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్రంలో ఆంగ్ల పత్రికల పనితీరు ప్రశంసనీయంగా ఉంటే పెద్దపెద్ద సర్క్యులేషన్ కలిగిన తెలుగు పత్రికల వ్యవహారశైలి ఆక్షేపణీయంగాను, సిగ్గుపడే విధంగాను ఉందని విచారం వ్యక్తం చేశారు. సొమ్ముచెల్లించి పత్రిక కొనుక్కునే పాఠకుడి వద్ద తెలుగుదినపత్రికలు విశ్వాసం కోల్పోయాయని, ఒకే విషయాన్ని కొన్నిపత్రికలు ఒక భావం కలిగేటట్లుగాను, మరికొన్ని పత్రికలు వ్యతిరేకభావం కలిగేటట్లుగాను ప్రచురిస్తున్నాయని ఇది చాలా నీచమైన విధానమని విమర్శించారు.

పాఠకులలో విశ్వసనీయత కోల్పోయే స్థితికి తెలుగు పత్రికలు దిగజారిపోవడం, తప్పులను, తప్పు చేసినవారిని నిస్సిగ్గుగా వెనకేసుకురావడం, వారి తప్పులకు వత్తాసు పలకడం, లేని విషయాలను ఉన్నట్లుగా తెలియచెప్పడం, సజీవ సాక్షులు మాదిరిగా ఇతరుల కలయికను చూసినట్లు వ్రాయడం ఇవన్నీ ప్రజలు అసహ్యించుకునేటట్లుగా ఉన్నాయని ఆయన అన్నారు. కేవలం డబ్బుకు అమ్ముడుపోయి, తమ అస్తిత్వాన్ని డబ్బు ఇచ్చేవారి కాళ్లముందు పడుకోపెట్టి తెలుగు పత్రికల యజమానులు ప్రజాస్వామ్యపు నాల్గవ మూలస్థంభానికి చెదలు పట్టిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

డబ్బు ఇస్తేనే వార్తలు వ్రాయడం, డబ్బు ఇవ్వని వారు ఎలాంటి మంచి పనులు చేసినా ఆ ఖ్యాతిని మరొకరికి అంటకట్టడం, డబ్బు ఇవ్వనివారి ప్రతిభను, సేవను, గొప్పతనాన్ని, భావాలను పట్టించుకోకపోవడం పత్రికా వ్యవస్థకు చేటుకాలాన్ని సూచిస్తున్నాయని జీవీఎల్ విమర్శించారు.

ఈ సందర్భంగా ప్రఖ్యాత వేదాంగ జ్యోతిష్య పండితులు కందాళ వేంకట సత్యశ్యామ్ మాట్లాడుతూ విశాఖ అనే పదం కుమారస్వామికి అన్వయిస్తుందని, ఆయన నిత్య యవ్వనుడని, విశాఖ సమాచారమ్ అదే విధంగా నిత్యనూతనంగా 33 ఏళ్లుగా అప్రతిహతంగా కొనసాగుతోందని, ఈ పత్రికకు మంచి భవిష్యత్తు ఉందని ఆశీర్వదించారు. పత్రికా రంగంలో పనిచేయడానికి వ్యక్తిత్వం, నైపుణ్యం, బాధ్యత ఎంతో అవసరమని, సంస్థ ప్రగతిని కాంక్షించేవారి కారణంగానే ఆ సంస్థ అభివృద్ధి చెందుతుందని, విలేఖరులు, ఇతర సిబ్బంది ఎంతో శ్రద్ధ, భక్తి, బాధ్యతలతో పనిచేసి పత్రికను మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.




విశాఖ సమాచారమ్ ముఖ్య సంపాదకులు వీరభద్రరావు మాట్లాడుతూ 33 ఏళ్లుగా నిరంతరం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పత్రికను కొనసాగిస్తున్నామని, ఎన్నో ఆటుపోట్లు, వెన్నుపోట్లుతో సహా కరోనా వంటి మహమ్మారి విశాఖ సమాచారానికి జ్వరంలాగా పట్టుకొని పీడించాయని, ఇప్పుడు పత్రిక అలాంటి కష్టాలన్నింటినీ అధిగమించి తనంత తానుగా నిర్వహించుకోగలిగే శక్తి సమకూర్చుకుందని తెలిపారు. 33 ఏళ్లుగా ఎంతోమంది మిత్రులు, శ్రేయోభిలాషులు, ప్రభుత్వ అధికారులు, వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఈ పత్రికను అభివృద్ధి చెందడంలో తమవంతు సహకారం అందించారని, సిబ్బంది చేసిన, చేస్తున్న సేవలు మరువరానివని, వారి కృషి ఫలితంగానే పత్రిక విజయవంతమైందని తెలిపారు.

విశాఖ సమాచారమ్ వార్తా సేవల ఫలితంగా లభించిన కొన్ని విజయాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా పూర్వ మరియు ప్రస్తుత ఉద్యోగులు బాబూదేవ్, వేణుగోపాల్, పూజాత, అర్జిల్లి దాసు, మద్దాల కృష్ణారావు, యునైటెడ్ ఇండియా సీనియర్ డివిజనల్ మేనేజర్ డి.రామ్ సుధాకర్‌లు విశాఖ సమాచారమ్‌తో తమ అనుబంధాన్ని వివరించారు. పత్రిక యాజమాన్య బృంద సభ్యులు శ్రీరామ్ కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తూ పత్రిక విలువలు కాపాడుకుంటూ మరింత ముందుకు సాగేందుకు తనవంతు సహకారం అందిస్తూనే ఉంటానని తెలిపారు. ఈ సమావేశానికి వివిధ రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖులు, అభిమానులు విచ్చేసి శుభాకాంక్షలు తెలపడం తమ ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తోందని, త్వరలోనే పత్రికను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.

(మొదటి పేజీ తరువాయిలు)

### బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : ముఖ్యమంత్రి

మధ్యాహ్నం సుమారు 1.20 గంటలకు విశాఖ నుంచి హెలీకాప్టర్‌లో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న సిఎం, 1.35కు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చారు. దాదాపు గంటన్నర సమయం క్షతగాత్రులను, మృతుల బంధువులను పరామర్శించి, వైద్య సహాయంపై సమీక్షించిన అనంతరం, సుమారు 3.35 గంటలకు ఆసుపత్రి నుంచి బయలు దేరి వెళ్లారు.

ఈ పర్యటనలో ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఐటి మరియు పారిశ్రామిక శాఖామంత్రి గుడివాడ అమర్నాధ్, డిప్యుటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్‌సిలు ఇందుకూరి రఘురాజు, పెనుమత్స సురేష్‌బాబు, వరుదు కల్యాణి, ఎంఎల్‌ఏలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, సిఎం అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యుటీ మేయర్లు లయా యాదవ్, కోలగట్ల శ్రావణి, పలువురు నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైల్వే మంత్రికి జీవీఎల్ లేఖ

ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో హౌరా-చెన్నై ప్రధాన మార్గంలో విశాఖపట్నం-భువనేశ్వర్

మధ్య రైల్ల భద్రత గురించి నా తీవ్రమైన ఆందోళనను తెలియపరుస్తున్నాను" అని ఎంపీ జీవీఎల్ నరసింహారావు లేఖలో రాశారు.

రైలు భద్రతపై సమీక్ష జరపాలని కోరుతూ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, "ఐదు నెలల స్వల్ప వ్యవధిలో జరిగిన పై రెండు ప్రమాదాల దృష్ట్యా, రైలు భద్రతపై క్రమపద్ధతిలో, విస్తృత సమీక్ష చేయవలసిన అవసరం ఉందని, తద్వారా రైలు ప్రమాదాలు అరికట్టడమే కాకుండా ప్రయాణీకులకు భద్రతా భావాన్ని కలిగించాలని నేను అభిప్రాయ పడుతున్నాను."

నిన్న జరిగిన రైలు ప్రమాదంలో క్షతగాత్రులను మరియు మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు తక్షణ చర్యలు తీసుకున్నందుకు రైల్వే మంత్రి మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎంపీ జీవీఎల్ నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రయాణీకుల భద్రత మరియు భారతీయ రైల్వేలపై జాతీయ నమ్మకాన్ని నిలబెట్టే లక్ష్యంతో రైల్వే మంత్రిత్వ శాఖ తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశభావం వ్యక్తం చేశారు ఎంపీ జీవీఎల్.

## నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఎఐటియుసి డిమాండ్ ఏఐటీయూసీ 104 వ్యవస్థాపక దినోత్సవాన్ని తేదీ 30 10 2023 ఉదయం 9:30 కి అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ శ్రీనివాస్ నగర్ ఆటో స్టాండ్ లో ఎర్ర జెండాను ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జీ వామ నమూర్తి ఎర్ర జెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి కార్మిక వర్గానికి చట్టాలు హక్కులు కల్పించాలని సంపూర్ణ స్వాతంత్రం కావాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 1920 అక్టోబర్ 31న అఖిల్ భారత్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జాతీయ గౌరవ అధ్యక్షులు జవహర్లాల్ నెహ్రూ గారు బాల్ గంగాధర్ తిలక్ ముజఫర్ వారి నాయకత్వంలో 1926లో ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సాధించుకున్నారు బ్యాంకులు జాతీయకరణ ప్రభుత్వ రంగ సంస్థల స్థాపనకు నాటినుండి నేటి వరకు కార్మికులకు చట్టాలు పనిగంటలు కావాలని దేశానికి సంపూర్ణ స్వాతంత్రం సాధించాలని మహత్తరమైన పోరాటాలు నడిపిన చరిత్ర ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు కార్మిక హక్కులను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత ప్రైవేటు బడా కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతుందని మండిపడ్డారు దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు మూతపడిన వేలాది పరిశ్రమలు తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారులేని పక్షంలో కార్మిక ప్రజా ఆగ్రహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ప్రభుత్వాలను హెచ్చరించారు.

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద మాట్లాడుతూ ఆటో అండ్ మోటార్ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు చేయాలని భారీగా పెంచినడీజిల్ పెట్రోలు విద్యుత్ చార్జీలు తగ్గించి డ్రైవర్లకు జీవన ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు ఆటోను మోటార్ వాహనాలపై విడుదల చేసిన జీవో నెంబర్ 21 31 నీ ఆటోల పైఉన్న పోలీస్ పెండింగ్ ఈ చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రావి కృష్ణ కాంగ్రేకుల రాము వై వెంకట్ కేలం శివ హెచ్ శేఖర్ జై గణేష్ కుమార్ ఏ శంకర్ కోటి ఈశ్వరరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పార్వతీపురం పట్టణంలో ఏనుగు సంచారం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌తోపాటు పట్టణంలోని కొత్తవలసలో ఉన్న పలు కాలనీల్లో ఏనుగు శనివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో సంచరించింది. దీంతో, ఆయా ప్రాంతాల ప్రజలతోపాటు పట్టణ ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ ఒంటరి ఏనుగు పట్టణ రైల్వే స్టేషన్, మణికంఠ కాలనీ, కెపిఎం పాఠశాల వీధి, పెద్దవీధి ప్రాంతాల్లో కలియ తిరిగింది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టమూ చేయకుండా తిరిగి కొమరాడ మండలం పరసురాంపురం వైపు వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఏనుగు అర్ధరాత్రి సంచరించడం, ఆ సమయంలో జనసమ్మర్ధం లేకపోవడంతో పెద్దగా నష్టం జరగలేదంటున్నారు. ఏనుగులను తరలించేందుకు పాలకులు, అధికారులు చర్యలు చేపట్టకపోవడమేమిటని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇంతవరకూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియమ్మవలస, బలిజిపేట, గరుగుబిల్లి, భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాల ప్రజలకు ఏనుగులు ప్రాణసంకటంగా మారాయి. ఇప్పుడు ఏనుగు ఏకంగా పార్వతీపురం పట్టణంలోనికి ప్రవేశించి స్వైరవిహారం చేయడం చూస్తుంటే వాటి నియంత్రణలోగానీ, వాటిని తరలించడంలోగానీ అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏనుగు సంచారంపై రాత్రి వేళల్లో గస్తీని (పెట్రోలింగ్) పెంచినట్లు జిల్లా అటవీ శాఖాధికారి జిఎపి ప్రసూన తెలిపారు. 17 మంది ఏనుగు ట్రాకర్లు రెండు బృందాలుగా రేయింబవళ్లు నిశితంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఏడు ఏనుగుల గుంపు గొట్టివలస నుండి దలైవలస మెట్టకు వెళ్లిందని, ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సహకరించాలని ఆమె కోరారు.

# ఆశ్చర్యపోతున్న అటవీ అధికారులు



ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, (విశాఖ సమాచారమ్): ఒక పులి 700 కి.మీ మేర ప్రయాణం చేసిన సంఘటన ఇది. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు ఒకటి, రెండు జరిగినట్లు చెబుతున్న అటవీశాఖ అధికారులు ఈ సుదీర్ఘ ప్రయాణాల పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కనిపించిన పులి మహారాష్ట్ర నుండి వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. తెలంగాణలోని అటవీ ప్రాంతం నురచి రాష్ట్రంలోని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల అటవీ ప్రాంతం, అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు, అనంతగిరి, కాకినాడ, విజయనగరం జిల్లాల్లోని అటవీ ప్రారతాల్లో ఈ పులి తిరిగినట్లు గుర్తించారు. అధికారుల నిర్ధారణ ప్రకారం మహారాష్ట్రలోని బ్రహ్మగిరి అటవీ డివిజన్ ప్రాంతం నుండి ఈ పులి వచ్చింది. అయితే, ఇంత దూరం ప్రయాణం చేయడానికి గల కారణాలను మాత్రం అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్‌లోని ఖానా అటవీ ప్రారతం నుంచి ఒక పులి ఏకంగా నల్లమల అటవీ ప్రారతానికి వచ్చేసింది. ఆ తరువాత ఇదే పులిని ఖానా ప్రారతంలో గుర్తించారు. అంటే రానుపోనూ దాదాపు రెండు వేల కిలోమీటర్ల దూరం ఈ పులి ప్రయాణించినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఒక పులి తన జీవనం కోసం ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని ఎంపికచేసుకుని, దానిని తన అడ్డాగా మార్చుకుంటుంది. ఆ ప్రాంతంలోకి మరే పులి రాకుండా కూడా చూసుకుంటుందని అటవీ నిపుణులు చెబుతున్నారు. అయితే పై రెండు ఘటనల్లో ఒక పరిధి లేకుండా వందల వేల కిలోమీటర్ల దూరం ప్రయాణాలు చేయడం ఆశ్చర్యకరమని ఒక అధికారి అన్నారు. పులులు కొత్త కారిడార్లు ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా కనపడుతోందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం నల్లమల అటవీ ప్రారతంలో మాత్రమే పులులు సంచరిస్తుండగా, తాజాగా ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే పరిస్థితులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

# బాలేశ్వర్ నుంచి రైల్వే అధికారులు గుణపాఠాలు నేర్చుకోలేదా?

విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం.. ఈ సంవత్సరం జూన్‌లో.. ఒడిశా.. బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదాన్ని పోలి ఉంది. మరి ఆ ప్రమాదం నుంచి రైల్వే అధికారులు పాఠాలు నేర్చుకోలేదా? చైనా లాంటి దేశాలు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే రైళ్లను నడుపుతున్నాయి. మన దేశంలో మాత్రం రైళ్ల వేగం గంటకు యావరేజ్‌గా 100 కిలోమీటర్లు కూడా లేదు. కొత్తగా వచ్చిన వందే భారత్‌ల సగటు వేగం కూడా 95కిలోమీటర్లే. దానికే మనం వేగవంతమైన రైళ్లను నడిపేస్తున్నామని కేంద్ర రైల్వే శాఖ గొప్పగా చెప్పుకుంటోంది. కానీ వరుస ప్రమాదాలు.. మన రైల్వే వ్యవస్థను ప్రశ్నిస్తున్నాయి. ప్రపంచ దేశాలు. భారత రైల్వే వ్యవస్థ.. ప్రమాదాల మయం అని అనుకునేలా చేస్తున్నాయి. ఒడిశా.. బాలేశ్వర్ ప్రమాదం జరిగిన 5 నెలల్లోనే మరో ప్రమాదం జరిగింది. మరి బాలేశ్వర్ నుంచి రైల్వే అధికారులు గుణపాఠాలు నేర్చుకోలేదా?

## 10 రోజుల్లో పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు



తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు మరో 10 రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బ్రోచర్ ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు.

నవంబరు 10 నుంచి 18 వరకు తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

నవంబర్ 7 న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. నవంబర్ 9న లక్ష కుంకుమార్చన, 10న ధ్వజారోహణం తో శ్రీపద్మావతి అమ్మవారు కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

నవంబర్ 14న అమ్మవారు ప్రీతిపాత్రమైన గజవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనుంది. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టం పంచమి తీర్థం 18 న ఉంటుందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు.

రూ. 9 కోట్లతో తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పుష్కరిణీ అభివృద్ధి చేపట్టిన టీటీడీ పద్మసరోవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి పంచమీ తీర్థం నాటికి పూర్తి అవుతుందని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చెప్పారు.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

| పంచాంగం | మంగళవారం 31-10-2023<br>శోభకృత్ నామ సంవత్సరము<br>దక్షిణాయణం శరదృతువు<br>ఆశ్వయుజ మాసం |
|---|---|
| తిథి | : బ. తదియ రా. 10.46 |
| నక్షత్రం | : రోహిణి ఉ. 06.00 |
| వర్జ్యం | : రా. 09.40 ల 11.14 |

### జగన్ ఎందుకు కావాలి విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీవీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ తూర్పు నియోజకవర్గం జీవీఎంసీ 22వ వార్డులో పీతల గోవింద 22 వ వార్డు అధ్యక్షులు, డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావాలి విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీవీ సత్యనారాయణ విశాఖ పార్లమెంట్ సభ్యులు, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, అలాగే జీవీ, APIIC DIRECTOR మొల్లి అప్పారావు , జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్ , 22వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, 22వ వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

### పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీసు బ్యాండ్ నిర్వహించిన జిల్లా పోలీసులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పోలీస్ బ్యాండ్ నిర్వహించారు. దేశభక్తి పాటలు, వీనుల విందైన సంగీతాన్ని వినిపించారు. ప్రజలు ఆస్వాదించారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అనకాపల్లి టౌన్ ఎస్సై సింహాచలం మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను కొనియాడారు. వారి త్యాగాలను స్మరిస్తూ, ప్రతి ఏటా పోలీసు అమరవీరుల వారోత్సవాలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎంతో మంది పోలీసులు అమరుల య్యారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ, అమరులైన పోలీసులకు జోహార్లు అర్పించారు. పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




# విశాఖ సమాచారమ్

మంగళవారం 31-10-2023


## మనిషికి మంచితనం అనేది మహావృక్షం లాంటిది

మనిషికి మంచితనం అనేది మహావృక్షం లాంటిది . ఎవరు ఎంత నరికినా... మళ్ళీ మళ్ళీ చిగురిస్తూనే ఉంటుంది . గుండె లోతుల్లోనుంచి జీవం పోసుకుంటూనే ఉంటుంది . గాలి మన కంటికి కనిపించక పోయినా మనకు ప్రాణం పోస్తుంది. అలాగే మనం చేసే మంచి పనులు పదిమందికీ తెలియకపోయినా ఫరవాలేదు కానీ ఒకరి జీవితంలోనైనా సంతోషం నింపితే అదే చాలు . ప్రేమ , స్నేహం , గౌరవం అనేవి చెప్పుకుంటేనో అడుక్కుంటేనో వచ్చేవి కావు . మన గుణం , మన నడవడిక , మనం చేసే మంచి పనులు... వలన వాటంతట అవే మన దగ్గరకు రావాలి. అప్పుడే మనకు విలువ. జీవితంలో స్నేహం ఒక భాగం . జీవితమనే నావలో తెలిసీ తెలియని వయసులో కారణం లేకుండా నవ్వుతూ .. ఆడుతూ.. పాడుతూ చిలిపి పనులు చేసిన క్షణాలు జీవితాంతం గుర్తుండి పోతాయి. అవి గుర్తుకు వచ్చినప్పుడంతా ... మళ్ళీ ఆ రోజులు వస్తే బాగుండని కొద్దిసేపు అప్పటి క్షణాలు ఊహించుకుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. కాలచక్రం గిర్రున తిరిగి పోతుంది. ఎందుకంటే కాలం ఎవరికోసం ఆగదు కదా . నాటి మిత్రులను తలచుకుంటే నేడు ఆ రూపాలు ఎక్కడ కానరావు. మనుషుల్లో .. ఆరోగ్యపరంగా , ఆర్థికపరంగా , వయోపరంగా , హెూదాపరంగా ఎన్నిమార్పులు వచ్చినా గానీ మిత్రుల మధ్య ఎలాంటి బేధమూ ఉండదు . సంపాదన అనేది జీవన యానం లో ఒక భాగం . అది మన తపన . తిని అరిగించు కోడం అనేది మన అదృష్టం . వెండి కంచంలో తిన్నా , విస్తరాకులో తిన్నా ... తిన్నది అరిగించుకున్న వాళ్ళే అదృష్ట వంతులు. ఐశ్వర్యం అంటే ఆడంబరాల్లో ఉండదు. ఇంద్రభవనం లో ఉన్నా.. పూరి గుడిసెలో ఉన్నా ఆరోగ్యంతో పొందే ఆనందంలో ఉంటుంది. రాయి ఎల్లప్పుడూ నీటిలో ఉన్నా మెత్తబడదు. అలాగే దీరుడికి ఎన్ని కష్టాలు వచ్చినా ఆత్మవిశ్వాసం మాత్రం కోల్పోడు. మనకు ఎంత ఉన్నా "లేని వారికి" సహాయం చేస్తే భగవంతుడు ఏదో రూపంలో పదిరెట్లు ఇస్తాడు . కాబట్టి ప్రతీ మనిషి సహాయ గుణం కలిగి ఉండాలి.అది ధనరూపంలోనే కానక్కరలేదు . కష్టంలో ఉన్న వారికి నీకు నేనున్నానని తోడుగా నిలబడితే చాలు . ఆ ధైర్యంతోనే వాళ్ళు సమస్యల నుండి బైటపడగలుగుతారు . ఒక్కరికీ చేసిన సహాయం పది పుణ్యక్షేత్రాలు తిరిగి వచ్చిన దానికంటే ఎక్కువ ఫలితం లభిస్తుంది.

## క్రీడాకారులకు చేయూతనిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్)



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** యోగా వలన శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రముఖ వ్యాపారవేత్త, ముత్యాల గార్మెంట్స్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం వి ఆర్) పేర్కొన్నారు.

జిల్లాలోని చోడవరం నియోజకవర్గం కి చెందిన పతాంజలి యోగ సెంటర్ నందుగల విద్యార్థిని విద్యార్థులకు, జిల్లా యోగా సెంటర్ అధ్యక్షులు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థు లకు ఎం.వి.ఆర్ చేతుల మీదుగా పతకాలను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ మాట్లాడుతూ, యోగా అనేది మన ప్రాచీన కాలం నుంచి అనాది గా వస్తుందని, నిరంతరం యోగా చేయడం వలన మనలో ఆత్మస్థైర్యం మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. శరీరంలోని అన్ని అవయవాలు సక్రమంగా, శక్తివంతంగా పనిచేసేందుకు ఈ యోగ ఎంత గానో దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా స్థానిక ఎంవిఆర్ కార్యాలయం నందు సోమవారం చోడవరం నియోజవర్గం,చోడవరం మండలం పరిధికి చెందిన మైచర్లపాలెం గ్రామానికి చెందిన రామాలయ నిర్మాణ కమిటీ సభ్యులు ముత్యాల గార్మెంట్స్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ను కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ నిర్మాణం కొరకు ఎంతో సేవలు అందించిన ఎం.వి.ఆర్ కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ "స్పందన" కార్యక్రమానికి 46 ఫిర్యాదులు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** హిస్పందన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులకు సూచించారు. సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సత్వర అన్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.సోమవారం పోలీసు స్పందన కార్యక్రమానికి 46 ఫిర్యాదు లలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఫిర్యాదు దారులు సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు, ఎస్పి గ సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.

## హరిహరాత్మజ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో స్వాములందరికీ నిత్యాన్నదానాన్ని ప్రారంభించిన సీతంరాజు సుధాకర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ అల్లిపురం వైర్ లెస్ కాలని లో హరిహరాత్మజ ట్రస్ట్,కోదండ రామాలయ వారి ఆధ్వర్యంలో మాల ధరించిన స్వాములందరికీ నిత్యాన్నదానాన్ని ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు..ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఆధ్యాత్మికతను పెంపొందించే దిశగా ట్రస్ట్ సభ్యులు ప్రయత్నం నిజంగా అభినందిదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ఈ రోజు నుంచి డిసెంబర్ 9 తేదీ వరకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వామిలు అందరు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరేరు..గత 6 సంవత్సరాలనుంచి దిగ్విజంగా ఈ మహత్తర కార్యాన్ని నిర్వహిస్తున్నామని రోజుకి 8వందల నుంచి 1200 స్వామిలు వచ్చి ప్రసాదాన్ని స్వీకరిస్తారని తెలిపెరు..ప్రతి రోజు ముడు పూటలా స్వాములకి ప్రసాద వితరణ జరుగుతుందని..ఈ సదావకాశాన్ని స్వామీలందరూ వినియోగించుకోవాలని ట్రస్ట్ సభ్యులు కోరేరు..

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ కడగల శ్రీనివాసురావు,కంచు వెంకటరమణ మూర్తి,కోదండ రామఆలయ అధ్యక్షులు కొత్తపల్లి సుబ్రహ్మణ్యం ,స్థానిక వైసీపీ నాయకులు ఊరుకూటి నారాయణ,ఆళ్ళ లీలావతి,చెన్న జానకిరామ్,స్వాములు అవతార్,లక్ష్మి నారాయణ,బాల శంకర్, శ్రీనివాసా రావు,తదితరులు పాల్గొన్నారు..

## వై నీడ్ ఏపీ జగన్ కార్యక్రమం విజయవంతంచేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవంబర్ 9వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వై నీడ్ ఏపి జగన్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో విజయవంతం చెయ్యాలని సోమవారం

విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త గౌరవనీయులు ఎం వి వి సత్యనారాయణ గారు..అన్నారు. ఈమేరకు స్థానిక జీవీఎంసీ 23 వ వార్డ్ కార్పొరేటర్ గుడ్ల విజయసాయి సత్యరెడ్డి అధ్యక్షతన ప్రియదర్శినికాలనీ, సామాజికభవనములో జరిగిన సచివాలయ గృహశారదులు,కన్వీనర్లు వాలంటీర్ల సమీక్ష సమావేశంలో హాజరై గౌరవనీయులు ఎంవివి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రానికి మళ్లీ సీఎంగా గౌరవనీయులు వైఎస్ జగన్మోహన్ రెడ్డినే ఎందుకు ఎన్నుకోవాలో ప్రజలకు వివరించేందుకు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని పార్టీలోని ప్రతి ఒక్కరు బాధ్యతతో దిగ్విజయం చెయ్యాలని కోరారు.భారతదేశ చరిత్రలో ఇంటి వద్దకే పాలన అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని అన్నారు. లంచాలు లేకుండా సంక్షేమం అందిస్తున్నారని చెప్పారు. 'నేను విన్నాను, నేను ఉన్నాను' అంటే ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నామని చెప్పారు. సీఎం గౌరవనీయులు శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం భారత దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఎప్పుడూ చూడలేదని చెప్పారు.గడిచిన 4 1/2 ఏళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అర్హులయినా వారికీ గౌరవనీయులు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందించారన్నారు.అనంతరము మాజీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ గౌరవనీయులు గన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని అన్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రతి గడపగడపకు వెళ్లి అందరికీ వివరించే దిశగా ప్రతి వాలంటీర్లు, గృహశారదులు పనిచేయాలని పిలుపునిచ్చారు, ముఖ్యంగా అమ్మబడి రైతు భరోసా జగనన్న ఆసరా వంటి సంక్షేమ పథకాల విశిష్టతను ప్రతి ఒక్కరికి అవగాహన ద్వారా తెలియపరచాలని పేర్కొన్నారు. కార్యక్రములో ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ మొల్లి అప్పారావు,విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్,సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లుపార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.




## హెల్ప్‌లైన్ నంబర్లు !

విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఘటనా స్థలం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే, విశాఖ జిల్లా అధికారులు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విశాఖపట్టణంలోని కేజీహెచ్, విమ్స్‌లో వైద్య బృందాలను ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. విశాఖపట్టణం నుంచి ఘటనా స్థలానికి అంబులెన్స్‌లు పంపించారు. ఈ నేపథ్యంలో హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

హెల్ప్‌లైన్ నంబర్లు ఇలా..

**విజయనగరం కలెక్టరేట్:** 94935 89157

**విశాఖ కలెక్టరేట్:** 90302 26621, 70361 11169, 08912 590102

**కేజీహెచ్** 89125 58494, 83414 83151

83414 83151 (ఈ నంబరులో నిత్యం వైద్యుడు అందుబాటులో ఉంటాడు)

అత్యవసర వైద్య సదుపాయం కోసం 8688321986 నంబరును సంప్రదించవచ్చు

**భువనేశ్వర్:** 06742301625, 06742301525, 06742303060, 06742303729

**వాల్తేరు టెస్ట్ రూం** 89780 80805

**సీనియర్ సెక్షన్ ఇంజినీర్** 89780 80815

**వాల్తేరు డివిజన్** 08942286245, 08942286213

**అలమండ, కంటకాపల్లి** : 89780 81960

**విజయనగరం:** 08922221206, 08922221202, 8978080006

**శ్రీకాకుళం రోడ్డు:** 08942286213, 08922286245

**ఏలూరు:** 08812232267

**సామర్లకోట:** 08842327010

**రాజమహేంద్రవరం:** 08832420541

**తుని:** 08854252172

**విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు:** 08912 746330, 08912 744619, 8106053051, 81060 53052, 85000 41670, 85000 41671.

## బాలేశ్వర్ తరహాలోనే మరో ఘోరం

విజయనగరం జిల్లాలో అంచనాలకు అందని ఘోరమైన రైలు ప్రమాదం చోటుచేసుకుంది. కొంతకాలంగా వరుస ఘటనలు జరుగుతున్నా వైఫల్యాల నుంచి రైల్వేశాఖ గుణపాఠాలు నేర్చుకోవట్లేదు.

రాయగడ ప్యాసింజర్ ఘటనకు సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలే కారణం!

విశాఖపట్నం: విజయనగరం జిల్లాలో అంచనాలకు అందని ఘోరమైన రైలు ప్రమాదం చోటుచేసుకుంది. కొంతకాలంగా వరుస ఘటనలు జరుగుతున్నా వైఫల్యాల నుంచి రైల్వేశాఖ గుణపాఠాలు నేర్చుకోవట్లేదు. సిగ్నలింగ్ వ్యవస్థలోని లోపాలను సరిచేసుకోకుండా అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని కంటకపల్లి-అలమండల స్టేషన్ల మధ్య భీమాలికి దగ్గరలో జరిగిన రైలుప్రమాదం.. కొద్దినెలల క్రితం ఒడిశాలోని బాలేశ్వర్ సమీపంలో జరిగిన రైలుప్రమాదాన్ని తలపిస్తోంది. విశాఖపట్నం-పలాస ప్యాసింజర్ సిగ్నల్ లేకపోవడంతో భీమాలి సమీపంలో అత్యంత నెమ్మదిగా వెళ్తోంది ఇంతలో వెనుక నుంచి విశాఖపట్నం-రాయగడ ప్యాసింజర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో పలాస ప్యాసింజర్‌కు చెందిన గార్డ్ బోగీ ఎగిరి దూరంగా పడింది. దానికి ముందున్న రెండు బోగీలు పక్కకు ఒరిగి, అవతలి ట్రాక్‌పై బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు ఇంజిన్‌ను ఢీకొని నుజ్జునుజ్జయ్యాయి. రాయగడ ప్యాసింజర్ ఇంజిన్ పూర్తిగా ధ్వంసమైంది. దాని రెండు బోగీలూ పట్టాలు తప్పాయి.

ఉదయం నుంచి సిగ్నలింగ్‌లో సమస్య

కంటకపల్లి వద్ద ఆదివారం ఉదయం నుంచి సిగ్నలింగ్‌లో సమస్య ఉన్నట్లు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. పలుదఫాలు సిగ్నలింగ్ వ్యవస్థ ఫెయిల్ అయిందని, దాన్ని సరిచేస్తూ వస్తున్నారని, పూర్తిస్థాయిలో సమస్య కొలిక్కిరాలేదని చెబుతున్నారు. ఇలాంటి లోపం వల్లే కంటకపల్లి దాటాక విశాఖ-పలాస ప్యాసింజర్‌కు సిగ్నల్ సరిగా లేక దాదాపు ఆగిపోయి ఉంది. ఆ సమయంలో కంటకపల్లి వద్ద ఆగిపోవాల్సిన విశాఖ-రాయగడ ప్యాసింజర్.. వేగంగా ముందుకెళ్లిపోయిందని, అక్కడ ఆగిన పలాస ప్యాసింజర్‌ను ఢీకొందని పేర్కొంటున్నారు.

రాయగడ ప్యాసింజర్ ఎందుకు ఆగలేదు?

సాధారణంగా ఓ రైలు ఒక స్టేషన్ నుంచి వెళ్లి, తర్వాత స్టేషన్ దాటేవరకు.. వెనక వచ్చే రైలుకు సిగ్నల్ ఇవ్వరు. కంటకపల్లి దాటివెళ్లి కొంత దూరం వెళ్లాక భీమాలి సమీపంలో పలాస ప్యాసింజర్ ఆగిపోయింది. అది తర్వాత స్టేషన్ అయిన అలమండకు చేరలేదు. దీంతో వెనుక వస్తున్న రాయగడ ప్యాసింజర్ కంటకపల్లి స్టేషన్ వద్ద ఆగాలి. కానీ అది ఎలా ముందుకు వెళ్లిందనేది ప్రశ్నార్థకంగా మారింది. సిగ్నలింగ్ వ్యవస్థలో వైఫల్యాలుంటే రైళ్లు 15 కి.మీ. వేగంతోనే వెళ్లాలి. కానీ రాయగడ ప్యాసింజర్ అధిక వేగంతో దూసుకెళ్లి, పలాస ప్యాసింజర్‌ను ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

సిగ్నలింగ్ సిబ్బంది అలసత్వమే కారణమా?

ఈ ఘోరప్రమాదానికి మానవ తప్పిదమే కారణమా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. సిగ్నలింగ్‌ను పర్యవేక్షించపోవడం, అందులో లోపాలున్నా సరైన చర్యలు తీసుకోపోవడం కారణమనే వాదన వినిపిస్తోంది. ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థలో ప్రొసీడ్ రాకపోతే రైలు ఆగిపోవాలని, కానీ ఆగకుండా ఓవర్ సూట్ చేసి రాయగడ ప్యాసింజర్ వెళ్లిందంటే ఇందుకు సిగ్నలింగ్ సిబ్బంది అలసత్వమే ప్రధాన కారణమనే వాదన వినిపిస్తోంది.

రెండు స్టేషన్ల మధ్య 9 కి.మీ.దూరం

కొత్తవలస జంక్షన్ నుంచి కంటకపల్లి స్టేషన్ 7 కి.మీ. దూరంలో ఉంది. కంటకపల్లి నుంచి తర్వాత స్టేషన్ అలమండ 9 కి.మీ. దూరంలో ఉంది. కంటకపల్లి-అలమండ మధ్యలోనే ప్రమాదం చోటుచేసుకుంది.

## స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో మొత్తంగా రూ.19,037 కోట్ల పెట్టుబడులకు ఆమోదం



**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ముఖ్యమంత్రి వైయస్.జగన్ అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో సమావేశమైన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు( ఎస్ఐపీబీ).

పలు పరిశ్రమల ప్రతిపాదనలకు, ప్రోత్సాహకాలకు ఎస్ఐపీబీ ఆమోదం.

ఇవాళ జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో మొత్తంగా రూ.19,037 కోట్ల పెట్టుబడులకు ఆమోదం.

తద్వారా 69,565 మందికి లభించనున్న ఉద్యోగాలు.

ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేయడంతో పాటు సూచనలు చేసిన సీఎం. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక రంగంలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. పరిశ్రమల ఉత్పాదకతలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసు కుంటున్నాయి. వీటన్నింటినీ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాలి. ప్రపంచ పారిశ్రామిక రంగం పోకడలను అవగతం చేసుకోవాలి. ఆ మేరకు పారిశ్రామిక విధానాల్లో మార్పులు, చేర్పులు చేయాలి. అత్యంత పారదర్శకత విధానాల ద్వారా అత్యంత సానుకూల వాతావరణాన్ని తీసుకురాగలిగాం. ఈ క్రమంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచాం. ఈ ప్రయాణం మరింతగా ముందుకు సాగాలి. పరిశ్రమల పట్ల సానుకూల క్రియాశీలతను మరింత బలోపేతం చేయాలి. పరిశ్రమల ఏర్పాటుకోసం ఇచ్చే అనుమతులు, తదితర అంశాల్లో ప్రభుత్వం నుంచి వేగంగా స్పందిస్తున్నాం. ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నామన్న భరోసాను వారికి కల్పిస్తున్నాం. అనుమతులు, క్లియరెన్స్ విషయంలో ఇప్పుడున్న వేగాన్ని మరింతంగా పెంచాల్సిన అవసరం ఉంది. పారిశ్రామిక వర్గాలనుంచి వచ్చే ప్రతిపాదనల పట్ల చురుగ్గా వ్యవహరించడంతో పాటు, వాటికి త్వరగా అనుమతులు మంజూరుచేసే ప్రక్రియ వేగాన్ని ఇంకా పెంచాలి . విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలో మరింత వేగం పెంచాలి:

గత ప్రభుత్వంలో కన్నా పరిశ్రమలకు పోత్సాహకాల విషయంలో ఈ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున మేలు చేకూర్చాం. ఎంఎస్ఎంఈల రంగానికి పునరుజ్జీవం ఇచ్చాం. ఇన్సెంటివ్‌లు ఇస్తూ వారికి చేదోడుగా నిలిచాం. ఎంఎస్ఎంఈల పట్ల చాలా సానుకూలతతో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎక్కువమంది వీటిపై ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి.. వీటిని కాపాడుకోవడం ప్రభుత్వంమీదున్న బాధ్యత: సీఎం శ్రీ వైయస్.జగన్.

ఎస్ఐపీబీ ఆమోదం పొందిన కంపెనీల వివరాలు ఇలా ఉన్నాయి:

1. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్న పెప్పర్ మోషన్ కంపెనీ. రూ.4,640 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా 8080 మందికి ఉద్యోగాలు.

2. విజయనగరం జిల్లా ఎస్.కోటలో జేఎస్ డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం. రూ.531 కోట్లు పెట్టుబడి, 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.

3. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో శ్రేయాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు.

రూ.1750 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ప్రత్యక్షంగానూ, మరో 500 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.

4. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో స్మైల్ (సబ్‌స్ట్రేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా లిమిటెడ్ ఎంటర్‌ప్రైజెస్)కంపెనీ ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారీ యూనిట్.

రూ.166 కోట్ల పెట్టుబడి, దాదాపు 5 వేలమందికి ఉద్యోగాలు.

5. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్ (రిలయెన్స్ పవర్) తన పారిశ్రామిక కార్యకలాపాన్ని మార్చుకునేందుకు ఎస్ఐపీబీ ఆమోదం.

థర్మల్ పవర్ స్థానంలో కొత్త తరహా, సాంప్రదాయేతర పర్యావరణహిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటుకు ఎస్ఐపీబీ ఆమోదం.

రూ.6,174 కోట్ల పెట్టుబడి, 600 మందికి ప్రత్యక్షంగానూ, 2000 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు.

6. ఇవికాక మరో మూడు కంపెనీల విస్తరణకూ ఎస్ఐపీబీ ఆమోదం, ఆమేరకు వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఎస్ఐపీబీ ఆమోదం.

తూర్పుగోదావరి జిల్లా కడియం వద్ద ఆంధ్రాపేపర్ లిమిటెడ్ విస్తరణ.

రూ.4వేల కోట్ల పెట్టుబడి, 3 వేలమందికి ఉద్యోగాలు.

7. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఏటీసీ టైర్స్ లిమిటెడ్ విస్తరణ.

రూ.679 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు.

8. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విస్తరణ.

రూ.933 కోట్ల పెట్టుబడి, 2,100 మందికి ఉద్యోగాలు.

9. ఏలూరు జిల్లా కొమ్మూరు వద్ద రూ.114 కోట్ల పెట్టుబడి పెట్టనున్న శ్రీ వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడ్.

310 మందికి ఉద్యోగాలు. ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ.

10. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం మద్ది వద్ద రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టనున్న ఓరిల్ ఫుడ్స్ లిమిటెడ్.

## నీటి వనరుల అభివృద్ధి పనులను పరిశీలించిన జివిఎంసి కమిషనర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జివిఎంసి పరిధిలో ఉన్న నీటి వనరుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. సోమవారం ఆయన ఆరవ జోన్ నందు మింది, నాతయ్య పాలెం నీటి వనరుల అభివృద్ధి పనులను ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ శ్రీనివాస్, జివిఎంసి బండ్ దారిని సరి చేసి తో కలసి పరిశీలించారు.

ముందుగా మింది ప్రాంతంలో 14.6 ఎకరాల స్థలంలో అభివృద్ధి చేస్తున్న నీటి వనరు ప్రదేశాన్ని పరిశీలించి చుట్టూ ఉన్న బండ్ దారిని సరి చేసి స్టోన్ పిచ్చింగ్ చేయాలన్నారు. నాతయ్య పాలెం నీటి వనరు ప్రదేశాన్ని పరిశీలించి నీటిలో 10 వేల గంబుషియా ఫిష్ లను వేయాలని, ఆ బండ్ దారిని సరి చేసి చుట్టూ లైటింగ్ ను ఏర్పాటు చేయాలని, నీటి వనరుకు వచ్చే ఎంట్రెన్స్ ప్రదేశాన్ని విశాలపరిచే పనులు చేపట్టాలని పర్యవేక్షక ఇంజనీర్ కె.వి.ఎన్ రవి ను, గ్రీన్ కార్పొరేషన్ అసోసియేట్ శ్రీనివాసు ను కమిషనర్ ఆదేశించారు.

అనంతరం జోన్ 6 ,బాల చెరువు రోడ్డును గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి ,74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డితో కలిసి పరిశీలించారు. బాల చెరువు నుండి గంగవరం పోర్టు బ్రిడ్జి వరకు తారు రోడ్డు బాగా పాడైయున్నందున వెంటనే తారు రోడ్డును వేయాలని శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ వంశీ రెడ్డి కమిషనర్ కు కోరగా, కమిషనర్ స్పందిస్తూ ఆ రోడ్డు ను వేయుటకు అంచనాలతో ప్రతిపాదనలను తయారు చేయమని పర్యవేక్షక ఇంజనీర్ రవికి కమిషనర్ సూచించారు. గాజువాక ఏరియాలో నున్న పలు ప్రధాన సమస్యలను వివరంగా తెలిపినట్లైతే, వాటిని నేను పరిశీలించి చర్యలు చేపడతానని శాసనసభ సభ్యులు తిప్పల నాగిరెడ్డి కి కమిషనర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, ఆరవ జోనల్ కమిషనర్ సింహాచలం, కార్యనిర్వహాక ఇంజనీర్ ప్రసాద్ బాబు, ఉప కార్యనిర్వహాక ఇంజనీర్ మాధవరావు, ఏసిపి శ్రీ లక్ష్మి, గాజువాక వైసిపి నాయకులు దేవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైలు ప్రమాద బాధితుల బాధ్యత ప్రభుత్వానిదే



విజయనగరం: రైలు ప్రమాదంలో బాధితుల ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడేంత వరకు ఏపీ ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. సోమవారం విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ప్రభుత్వ యంత్రాగాన్ని అభినందించారు.

"ఘటన దురదృష్టకరం. బాధితుల ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడేంత వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుంది. వాళ్ల కుటుంబాలకు అండగా ఉంటుంది. ప్రమాదంలో మృతి చెందిన వాళ్ల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తాం. అలాగే తీవ్రంగా గాయపడిన వాళ్లకు రూ.2 లక్షలు, సాధారణ గాయాలైన వాళ్లకు రూ.50 వేల సాయం అందిస్తాము" అని మంత్రి బొత్స తెలిపారు.

ఏపీ ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిందని, సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొందని అభినందించారు. ఏపీ అధికారులు రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తున్నారని తెలిపారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల పునరుద్ధరణ పనులను కూడా రైల్వే అధికారులు ప్రారంభించారని.. సాయంత్రంలోపే పూర్తవుతాయని మంత్రి బొత్స మీడియాకు వివరించారు.

కంటాకపల్లి వద్ద పలాస-విశాఖ ప్యాసింజర్ రైలును రాయగడ-విశాఖ ప్యాసింజర్ రైలు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదు బోగీలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఇప్పటిదాకా 14 మంది మృతి చెందగా, 50 మందిదాకా గాయపడ్డారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే సీఎం జగన్.. ఘటనాస్థలానికి వెళ్లాలని, సహాయక చర్యలు పర్యవేక్షించాలని మంత్రి బొత్స సత్యనారాయణను ఆదేశించారు. దీంతో రాత్రి నుంచి ఆయన అక్కడే పరిస్థితిని సమీక్షిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు.

## భారతదేశ ఉక్కు మహిళ' ఇందిరాగాంధీ వర్ధంతి (అక్టోబరు 31)



మేధస్సు, తెగువ, రాజనీతి మూర్తీభవించిన మహిళ ఇందిరాగాంధీ తన రాజకీయ ప్రస్థానంలో పద్మవ్యూహాలు, చదరంగాలు, ఎగుడుదిగుళ్లు, ఎత్తుపల్లాలు అన్నింటినీ చాకచక్యంగా అధిగమించి తిరుగులేని నాయకురాలు ఇందిరాగాంధీ. 1917 నవంబర్ 19న జవహర్ లాల్ నెహ్రూ, కమలాదేవి దంపతులకు అలహాబాద్ లో ఇందిర జన్మించారు. శాంతినికేతన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ లో ఆమె విద్యాభ్యాసం కొనసాగింది. చిన్నప్పటి నుంచి ఆమెది విశిష్ట వ్యక్తిత్వం. నెహ్రూజీ పెంపకంలో లోకాన్ని చూసి సామాజిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ ఎదిగారు ఇందిర. 1930లో బాల చరఖా సంఘాన్ని స్థాపించారు. తాత మోతిలాల్ నెహ్రూ, తండ్రి జవహర్ లాల నెహ్రూ రాజకీయాల్లో తలములకలై ఉండడంతో ఇందిరకు చిన్నప్పటి నుండి రాజకీయాలపై ఆసక్తి. నెహ్రూ స్వాతంత్రోద్యమంలో జైల్ లో ఉంచబడిన సందర్భంలో తన కుమార్తె ఇందిర కు రాసిన ఉత్తరాలు చదివి ఆమె దేశ సేవ , సామాజిక స్పృహ లను తెలుసుకున్నారు. తన తోటి బాలికలతో 'వానరసేన' ఏర్పాటుచేసి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొంటున్న వారికి సహాయం అందించారు. 1942లో తన 25 ఏళ్ళ వయస్సులో స్వాతంత్రోద్యమంలో పాల్గొని జైల్ శిక్ష అనుభవించారు ఇందిర. దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత జరిగిన మతకల్లోలాలకు గురైన ప్రాంతాలను సందర్శించి, మహాత్మా గాంధీ మార్గదర్శకంలో వారికి సేవలు అందించారు. ఇందిర వివాహం ఫిరోజ్ గాంధీతో మార్చి 26, 1942న జరిగింది. ఈ దంపతులకు ఇరువురు సంతానం. రాజీవ్ గాంధీ, సంజీవ్ గాంధీ. 1955లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలైన ఇందిరా 1959-60లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలైనారు. లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో 1964-66 ప్రాంతంలో సమాచార ప్రసార శాఖమంత్రిగా భాద్యతలు నిర్వర్తించారు. శాస్త్రి మరణం తరువాత జనవరి 24, 1966 న మొదటిసారిగా భారత ప్రధానిగా ఇందిరా భాద్యతలు స్వీకరించారు. అప్పటి నుండి మార్చి 24, 1977 వరకూ దేశ భవిష్యత్తు ను ఇందిరాగాంధీ నిర్దేశించారు. ఆమె దేశ ప్రధానిగా భాద్యతలు చేపట్టే సమయానికి అనేక సమస్యలను ఆమె ఎదుర్కోవలసి వచ్చింది. ఒకవైపు పార్టీలో అంతర్గత కలహాలు, దేశాన్ని చుట్టుముట్టనున్న సమస్యలు ఆమెకు స్వాగతం పలికాయి. ఈశాన్యంలో మిజోల తిరుగుబాట్లు, దేశంలో కరువు కాటకాలు, కార్మికులలో అసంతృప్తి, రూపాయి విలువ తగ్గడంవల్ల దుర్బంధంగా మారిన పేదవాని పరిస్థితి, ప్రత్యేక రాష్ట్రం కోసం పంజాబ్ లో ఉద్యమాలు వంటి సమస్యలను ఆమె సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు. 1957 ఎన్నికలలో విజయం సాధించి, ప్రధానిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇందిరా ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోయారు. పేదరిక నిర్మూలనకు భూసంస్కరణల పథకం ప్రారంభించారు. వ్యక్తిగత ఆస్తులపై ఆంక్షలు విధించారు. బ్యాంకులను జాతీయం చేశారు. రాజ భరణాలను రద్దు చేశారు. ఒకటొకటిగా ఆమె చేపడుతున్న చర్యలతో ఆమెకు పార్టీలోని పెద్దలకు భేదాభిప్రాయాలు పొడచూపాయి. ఫలితంగా కాంగ్రెస్ రెండుగా చీలింది. 1971 లో ఇందిరాగాంధీ కాంగ్రెస్(ఐ) పేరుతో ఎన్నికలను ఎదుర్కొన్నారు. గరీబీ హటావో నినాదంతో దేశ ప్రజలను ఉత్తేజపరిచారు. మార్చి 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో ఆ దేశాన్ని ఓడించి బాంగ్లాదేశ్ ఏర్పాటుకు సహకరించారు. బంగ్లాదేశ్ శరణార్థులను తిరిగి వారి దేశానికి పంపటంలో నిర్ణయాత్మకంగా వ్యవహరించి దేశ విదేశాల్లో కూడా నీరాజనాలు అందుకున్నారు ఇందిరా. అప్పటి ప్రతిపక్ష సభ్యులు అటల బిహారీ వాజపేయి ఇందిరను దుర్గామాత తో పోల్చారు. 1975లో దేశంలో అప్పటి రాజకీయ కారణాల దృష్ట్యా ఇందిరా అత్యవసర పరిస్థితి ని విధించి దానిని 1977 వరకు కొనసాగించారు. ఎమర్జెన్సీ తొలగించి 1977లో ఎన్నికలు నిర్వహించగా ఆ ఎన్నికల్లో ఇందిరా నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓటమిపాలైంది. అధికారాన్ని చేపట్టిన పార్టీలు సుస్థిరమైన పాలనను అందివ్వలేక పోవడంతో, ఇందిరా సమర్ధవంతంగా పనిచేసే పార్టీ కి ఓటు అనే నినాదంతో 1980లో వచ్చిన ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి ప్రధాని పీఠాన్ని అధిరోహించారు. ఆమె పాలన కాలంలో దేశం ఆర్థికంగా, సాంకేతికంగా గణనీయమైన అభివృద్ధి సాధించింది. ఆమె మొత్తం నాలుగు పర్యాయాలు ప్రధాని పదవిని చేపట్టారు. అక్టోబర్ 31, 1984న సొంత అంగరక్షకుల తూటాలకు ఇందిరా బలై పోయారు. ఇందిరాగాంధీ కి 1971లో భారత రత్న అవార్డ్ లభించింది. ఇందిర రచయిత్రి కూడా ఆమె రాసిన పుస్తకాలు ది ఇయర్స్ ఆఫ్ ఛాలెంజ్, ది ఇయర్స్ ఆఫ్ ఎన్డీవర్, ఇండియా 1975 మొదలగునవి. ఆమె మొత్తం 5831 రోజులు భారత ప్రధానిగా ఉన్నారు. ఇందిరాగాంధీ స్మారక ట్రస్ట్ ద్వారా శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి కి పాటుపడే వారికి ప్రతి సంవత్సరం ఇందిరాగాంధీ శాంతి బహుమతి కి ఎంపిక చేస్తారు. దేశ రాజధాని ఢిల్లీలో ఇందిరాగాంధీ సమాధి 'శక్తిస్థల్' గా నామకరణం చేశారు.

**డా.జె వి ప్రమోద్ కుమార్**
**పైడిమెట్ట, 9490833108.**

# ఉల్లిపాయ ఎంత బరువుంటుంది



కూరల్లో వేసుకునే ఉల్లిపాయ ఎంత బరువుంటుంది.. మహా అయితే పది గ్రాముల కన్నా తక్కువే ఉంటుంది. అయితే ఓ ఉల్లిపాయ చూడ్డానికి పుచ్చకాయలా కనిపిస్తూ.. సుమారు ఎనిమిదికేజీల బరువును కలిగి గిన్నిస్ రికార్డుకెక్కింది. గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రకారం.. గారెత్ గ్రిఫిన్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ఉల్లిని సాగుచేస్తున్నాడు. గ్వెర్నీకి చెందిన ఇతను నార్త్ యార్క్‌షైర్‌లోని హారోగేట్ ఆటం ఫ్లవర్ షోలో గారెత్ ఇటీవల తాను పండించిన అతిపెద్ద ఉల్లిపాయను ప్రదర్శించాడు. ఇది 8.97 కేజీల బరువుని కలిగి ఉంది. 2014లో గిన్నిస్ రికార్డుకెక్కిన 8.5 కేజీల ఉల్లిపాయ రికార్డును గారెత్ బద్దలుకొట్టాడు. ఈ సందర్భంగా తాను తన తండ్రి నుంచే ఉల్లిసాగు నేర్చుకున్నానని గారెత్ చెబుతున్నారు. తనకి కూరగాయల్లో అతిపెద్దవి పండించి గిన్నీస్ రికార్డులో వరుసగా స్థానం సంపాదిస్తున్న పీటర్ గ్లేజ్ బ్రూక్‌నే తనకి స్ఫూర్తి అని గారెత్ చెబుతున్నాడు.

# ప్రారంభమైన సిపిఎం 'ప్రజా రక్షణ భేరి'



విజయవాడ : ప్రజా సమస్యలే అజెండాగా ... నేటి నుండి ' ప్రజా రక్షణ భేరి ' పేరుతో సిపిఎం ప్రచార జాతాలను చేపట్టింది.

సోమవారం కర్నూలు జిల్లా ఆదోనిలో, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో, మరో జాతా శ్రీకాకుళం జిల్లాలోని మందసలో ప్రారంభమైంది. కరువు, వెనుకబడిన ప్రాంతాల్లో పర్యటించేలా చేపట్టిన ప్రజారక్షణ భేరీ ప్రచార జాతాను సిపిఎం కేంద్రకమిటి సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగనుంది. కర్నూలు జిల్లా ఆదోని నుండి ఈ ప్రజారక్షణ భేరీ జాతాను సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ థావలే ప్రారంభించారు. మరోవైపు ... సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ జాతాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పాల్గొన్నారు. వి.వెంకటేశ్వర్లు ఈ యాత్రను సమన్వయం చేస్తున్నారు. ఈ యాత్ర ప్రధానంగా పోలవరం నిర్వాసితులు, గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలపై సాగుతుందని నేతలు తెలిపారు. మరో ప్రచారజాతా శ్రీకాకుళం జిల్లాలోని మందసలో ప్రారంభమై కోస్తా పారిశ్రామిక కారిడార్ గుండా సాగుతుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ఆధ్వర్యంలో కొనసాగుతోన్న ఈ జాతాను ఆలిండియా కిసాన్ సభ జాతీయ ప్రధానకార్యదర్శి విజు కృష్ణన్ ప్రారంభించారు. మంతెన సీతారాం సమన్వయం చేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు, అసంఘటిత రంగకార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కనీసవేతన చట్టాన్ని అమలు చేయాలని తదితర సమస్యలతో ఈ ప్రచారజాతా సాగుతుందని నేతలు తెలిపారు.

# యువతను మోసం చేసిన సీఎం

**నర్సీపట్నం టౌన్:** సిఎం జగన్ రెడ్డి యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో తెలుగుదేశం పార్టీ విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ఈ సంవత్సరం రైతులకు గడ్డుకాలం ఏర్పడిందని, వర్షాలు లేక పంటలు దెబ్బతిన్నాయని ఈ మేరకు అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి చేస్తున్న అరాచక పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని బూత్ కన్వీనర్లకు సూచించారు. నియోజకవర్గంలో 12 వేల దొంగ ఓటర్లను చేర్పించారని, 17 వేల ఓటర్లను తొలగించినట్లు గుర్తించామని, వీటిపై రాష్ట్ర ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రతి ఓటరు కూడా తమ ఓటు ఉందో లేదో ఆన్లైన్లో సరి చూసుకోవాలన్నారు. కుటుంబ సాధికారత భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముస్లిం సోదరులకు, జర్నలిస్టులకు ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసిన జగన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. యువతకు ఉపాధి కల్పించే లులూ వంటి కంపెనీలు జగన్ రెడ్డి వల్లే పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇటువంటి కంపెనీలు ఉంటే యువతకు ఉపాధి కలిగేదని పేర్కొన్నారు. ఈ నాలుగు సంవత్సరాలలో రోడ్ల మరమ్మతు చేపట్టిన దాఖలాలు లేవన్నారు.

# ప్రమాద వార్త విన్నప్పటి నుంచి రైల్వే శాఖ అప్రమత్తమైంది: విశాఖ రైల్వే స్టేషన్ మేనేజర్ అరుణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రమాద వార్త విన్నప్పటి నుంచి రైల్వే శాఖ అప్రమత్తమైందని విశాఖ రైల్వే స్టేషన్ మేనేజర్ అరుణ పేర్కొన్నారు. మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేకమైన ట్రైన్ లో అత్యున్నత కమిటీ వచ్చిందన్నారు. 10 మంది ఉన్నత అధికారుల బృందం ఘటన స్థలానికి వెళుతోందన్నారు. విజయనగరం రైలు ప్రమాద ఘటన స్థలానికి రెస్క్యూ టీమ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్‌తో పాటు రైల్వే అధికారులు కూడా వెళ్లారని అరుణ అన్నారు. రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రస్తుతానికి 9 రైళ్లు రద్దు అయ్యాయన్నారు. రద్దు అయిన ట్రెయిన్ వివరాలు ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నాని అరుణ అన్నారు. క్షతగాత్రులకు ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడ వైద్యసదుపాయాలు అందిస్తున్నా మన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. రైల్వే సిబ్బంది ప్రత్యేక డ్యూటీలు చేసి.. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తున్నామన్నారు. ఘటనా స్థలంలో అతి త్వరలోనే పునరుద్ధరణ కార్యక్రమాలు పూర్తి అవుతాయని అరుణ తెలిపారు.

# ఘనంగా ముగిసిన ధర్మ ప్రచార వారోత్సవాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రసిద్ధి చెందిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానం లో రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్. జగన్మోహనరెడ్డి, రాష్ట్ర ఐ. టి శాఖమాత్యులు గుడివాడ అమర్నాథ్, దేవదాయ ధర్మాదాయ శాఖమాత్యులు కొట్టు సత్యనారాయణ ల పిలుపు మేరకు నిర్వహిస్తున్న ధర్మ ప్రచార వారోత్సవాలు ముగింపు కార్యక్రమాలలో భాగం గా పిల్లా ఉమా (పోతురాజు సిండికేట్ ) ఆధ్వర్యంలో.. శ్రీ మరిడి మహాలక్ష్మి భజన బృందం వారి బైటో భజన కార్యక్రమం, పెతకంశెట్టి సుజాత నాయుడు ఆధ్వర్యంలో బొడ్డేడ విజయ రవికుమార్ సారథ్యంలో .. శ్రీ నూకాంబిక అమృత వర్షిణి బృందం వారిచే కోలాటం,శ్రీ గౌరీపరమేశ్వరి దేవాలయం అర్చకులు నేతేటి సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో శ్రీ గౌరీ లలితా ప్రార్థనా మండలి వారిచే పారాయణం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ నూకాంబిక దేవస్థాన చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈ వో బండారు ప్రసాద్, ధర్మకర్తలు మాట్లాడుతూ ఈ ధర్మప్రచార వారోత్సవాలకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఎన్నో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను అమ్మవారి దేవస్థానం లో నిర్వహిస్తామని ఆలయ నిర్వహకులు తెలియజేసారు.

# వ్యక్తిత్వ వికాసంతో ఉజ్వల భవిష్యత్



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం పెదబోదుగాల్లం లో ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశనుండే వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని ప్రముఖ న్యాయవాది, మోటివేషన్ స్పీకర్ ఎమ్.ఎ.రజాక్ అన్నారు. సోమవారం మండలంలో పెదబోదుగల్లం హైస్కూలు లో విద్యార్థులకు హెచ్. ఎమ్.సి.హెచ్. సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ఓటమి నుండి గెలుపు అనే అంశంపై విద్యార్థులకు స్ఫూర్తి దాయకమైన ప్రసంగాన్ని అందించారు. ఓటమి నుండి ఎలా బయటపడాలి. విజయంవైపు ఎలా ప్రయాణించాలి. అనే ఎన్నో ఉదాహరణలతో ఆయన వివరించారు. ఓటమి చెందడం నిజమైన ఓటమికాదని, అసలు ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమని అన్నారు. ఓటములు ,వైఫల్యాలు ఎదుర్కొని ప్రపంచ వ్యాప్తంగా విజయానికి, యువతకు ప్రేరణాశక్తికి మారుపేరుగా నిలిచిన స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, ధోని,సచిన్ టెండూల్కర్, రతన్ టాటా,వంటి మహనీయుల జీవితచరిత్ర లో జరిగిన యదార్థఘటనలను వివరించి స్ఫూర్తి ని అందించారు. లక్ష్యసాధన కు విద్యార్థులు నిరంతరం శ్రమించాలని అన్నారు. వ్యక్తిత్వ వికాసం అలవరచుకోవడంవలన అనేక ప్రయోజనాలను పొందడంతోపాటు ఉజ్వల భవిష్యత్తు కు పునాదులు వేసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, ఎస్.ఫల్గుణ రావు, ఎ.వి.ఎల్.ఎన్. కుమారి, రమేష్ బాబు, చిన్నారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# 2 నుంచి ఎంఎస్ఎంఇలో గిరిజన యువత ఎక్ఛేంజ్ కార్యక్రమాలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** గిరిజన యువత అభివృద్ధికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, హోం మంత్రిత్వ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు 2 నుంచి 8వ తేదీ వరకు 15వ 'గిరిజన యువత ఎక్ఛేంజ్ కార్యక్రమాలు' జరగనున్నాయని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం ఉమ్మడి విశాఖ పట్నం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. అనకా పల్లిలో ఆయన సోమవారం విలేఖర్లతో మాట్లాడుతూ కార్యక్రమాలు అచ్యుతాపురంలోని ఎం.ఎస్.ఎం.ఇ. టెక్నాలజీ సెంటర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఒక రాష్ట్రంలో జీవనశ్కెలి, అభివృద్ధి పరిస్థితిని మరొక రాష్ట్రం వారు తెలుసుకోవాలనే ధ్యేయంతో కేంద్ర ప్రభుత్వం 'గిరిజన యువత ఎక్సేంజ్ కార్యక్రమాలు'ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తుందని, అందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా గిరిజన యువత ఎక్ఛేంజ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జార్ఖండ్, ఒరిస్సా, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన తొమ్మిది జిల్లాల నుంచి 200 మంది గిరిజన యువతీయువకులు కార్యక్రమాలకు హాజరవుతారన్నారు. హోం మంత్రిత్వ శాఖకు చెందిన సీఆర్‌పీఎఫ్, బిఎస్ఎఫ్, ఎస్ఎస్‌బి అధికారులు యువతకు ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఏడు రోజులూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో యువత జీవన వ్యవహార శ్కెలి, ఆచార వ్యవహారాలు సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ రాష్ట్రాల భాషా సంప్రదాయాలు, నివసించు పద్ధతులు, ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలన, మహిళ, యువత అభివృద్ధిసాధికారిత, మత, ప్రాంతీయ, తీవ్రవాదం, ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడంలో సవాళు %--%పరిష్కారాలు, ఐక్యత స్వాతంత్ర్యపోరాటం, స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ సమైఖ్యతలో యువత పాత్ర, గిరిజస ప్రాంతాల సమస్యలు, ఉపాధి కల్పన, నవ భారత దేశం విజన్, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్, ఆర్గనైజేషన్ ఆఫ్ యూత్ పార్లమెంట్, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ, వక్తృత్వం, గిరిజన సంప్రదాయ నాట్య పోటీలు జరుగుతాయన్నారు. అదే విధంగా ఎస్ఇజడ్, బ్రాండిక్స్, స్టీల్ ప్లాంటు, ఎన్టీపీసీ, ఎం.ఎస్.ఎం.ఇ. మొదలగు పారిశ్రామిక, కైలాసగిరి, సింహాచలం, రామకృష్ణా బీచ్, బొజ్జన కొండ తదితర పర్యాటక కేంద్రాలను గిరిజన యువత సందర్శిస్తుందని యువ అధికారి మహేశ్వరరావు తెలిపారు.

గిరిజన యువత ఎక్ఛేంజ్ ప్రొగ్రాంకు జార్ఖండ్ రాష్ట్రం నుండి గుమ్లా, లాతేర్, సరయికేల-ఖరసవన్, ఒరిస్సా రాష్ట్రం నుంచి మలకన్ గిరి, కలహాండి, మహారాష్ట్ర నుండి గడ్చిరోలి, బీహార్ రాష్ట్రం నుంచి జమూయి, లాఖయిసరాల్, గయ జిల్లాల నుంచి యువత పాల్గొంటుందని ఆయన చెప్పారు.

## క్షత్రియ కల్యాణమండపం లో నేడు మెగా హెల్త్ క్యాంపు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ శ్రీ కె.కె రాజు గారు అభ్యర్థన మేరకు క్వీన్స్ ఎన్నారై హాస్పిటల్ సీతమ్మధార వారు క్షత్రియ సంక్షేమ సమితి వారి ఆధ్వర్యంలో రేపు 31/10/2023 మంగళవారం ఉదయం 9:00గం. నుండి మధ్యాహ్నం 1:00 గం. వరకు క్షత్రియ కల్యాణ మండపంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారు.

**"వారు అందిస్తున్న సేవలు"**

1. కార్డియాలజీ, 2. న్యూరాలజీ, 3. నెఫ్రాలజీ, 4. అంకాలజీ, 5. జనరల్ మెడిసిన్, 6. ఆర్థోపెడిక్, 7. గైనకాలజీ మొదలగు సేవలు అందుబాటులో పెడుతున్నారు. కావున అందరూ ఈ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరుకుంటున్నాను.

# వైవీ సుబ్బారెడ్డిని సత్కరించిన గంట్ల



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని సోమవారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఘనంగా సత్కరించి సింహాచలం దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వివరాలను శ్రీను బాబు తెలియజేశారు.జర్నలిస్ట్ ల ఇళ్ల స్థలాలు సమస్య పై త్వరలోనే ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఈ సందర్భముగా వైవి తెలియచేసారనీ శ్రీను బాబు చెప్పారు.

## బ్రెయిన్ ఆపరేషన్ బాధితులకి లక్ష రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ అందించిన మంత్రి అమర్నాథ్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి పట్టణ నివాసి కోలపర్తి కళ్యాణ భాస్కర్ బ్రెయిన్ అపరేషన్ నిమిత్తం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ చొరవ తీసుకొని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేయించి ఆ చెక్కును భాస్కర్ రావు అందించారు. ఈ సందర్భంగా కోలపర్తి భాస్కర రావు సీఎం జగన్మోహన్ రెడ్డి కి రాష్ట్ర మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్ కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ సకల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్ రోగులు ఎక్కువగా శ్రమించొద్దు

### గుండెపోటు మరణాలపై కేంద్ర ఆరోగ్య మంత్రి



**అహ్మదాబాద్:** ఇటీవలి కాలంలో గుండెపోటుకు గురై అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన రేపుతున్నాయి. తాజాగా గుండెపోటుతో సంభవిస్తున్న మరణాలపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్పందించారు. కొవిడ్-19 కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురై కోలుకున్నవారు తర్వాత ఒకటి నుంచి రెండేళ్లపాటు ఎక్కువగా శ్రమించకపోవడం మంచిదని తెలిపారు. దీనివల్ల కార్డియాక్ అరెస్ట్ ముప్పు నుంచి బయటపడొచ్చని సూచించారు. ఈ మేరకు ఆయన భారత వైద్య పరిశోధన మండలి అధ్యయనాన్ని ఉదహరించారు.

కొద్దిరోజుల క్రితం గుజరాత్‌లో దసరా పండగ సందర్భంగా గర్బా నృత్యం చేస్తూ పది మందికి పైగా మృతి చెందారు. ఈ మరణాలపై గుజరాత్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రుషికేష్ పటేల్ వైద్య నిపుణులు, కార్డియాలజిస్టులతో సమావేశం నిర్వహించారు. ఇందులో మన్‌సుఖ్ మాండవీయ కూడా పాల్గొన్నారు. "ఐసీఎమ్‌ఆర్ దీనిపై సమగ్ర అధ్యయనం నిర్వహించింది. వారి నివేదిక ప్రకారం కొవిడ్-19 కారణంగా తీవ్రంగా బాధపడిన వారు.. గుండెపోటు బారిన పడకుండా ఉండాలంటే.. కోలుకున్న తర్వాత రెండేళ్లపాటు ఒత్తిడితో కూడిన పనులు, పరిగెత్తడం, కఠినమైన వ్యాయామాలకు దూరంగా ఉండాలి" అని మాండవీయ సూచించారు.

## గురు స్పందన-2023 అవార్డ్ అందుకున్న మహాజన్ కృష్ణ ప్రసాద్



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):** ఈదా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి అధ్వర్యంలో "గురు స్పందన 2023" రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం లో గణిత ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న డాక్టర్ మహాజన్ కృష్ణ ప్రసాద్ ఎంపిక అయ్యారు. వీరికి ఈనెల 29 న ఏలూరు పట్టణంలో జరిగిన అవార్డ్ ప్రదానోత్సవంలో తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎం ఎల్ సి షేక్ సాబ్జీ, ఏలూరు జిల్లా విద్యా శాఖాధికారి శ్యాం సుందర్, ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సామ్యూల్ రెడ్డి ల చేతుల మీదుగా ఘనంగా సన్మానించి అవార్డ్ ను ప్రదానం చేశారు. మండల విద్య శాఖా అధికారులు సిచ్. బాలామణి మరియు నెహ్రూజి, ఉపాధ్యాయులు సుభాషిణి, భారత రాజు, సంధ్యా, దుర్గా భవాని, పృథ్వీ రాజ్ మరియు కుటుంబ సభ్యులు పూర్ణ మాలతి, విశ్వనాథ్, మహేశ్వరి లు డాక్టర్ మహాజన్ కృష్ణ ప్రసాద్ కు అభినందనలు తెలియచేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో కమల వికాసం ఎప్పుడో .......!? అవసరం (రాజకీయ పార్టీల చరిత్ర)



మూకల సూర్యప్రకాష్

(నిన్నటి తరువాయి)

ఇదీ ప్రాంతీయ పార్టీలో ప్రజాస్వామ్యం! పార్టీ ప్రారంభం నుంచి పార్టీ వ్యవస్థాపకునితో సమానంగా పనిచేసిన నాయకులకు కూడా పార్టీలో తగిన స్థానం ఉండదు.

ప్రాంతీయ పార్టీలలో దేశ ప్రయోజనాలు, జాతీయ భావాలు ఏకోశానా కనిపించవు. అధికారమే వారి పరమావధి. వ్యక్తిపూజ, కుటుంబ పాలన, వారసత్వ అధికారం సర్వసాధారణం.

ప్రజల బలహీనతలను రెచ్చగొట్టి, సున్నితమైన సెంటిమెంట్‌లను బలంగా రాజేసి ఓట్లు దండుకొని అధికారం సాధించడమే ప్రాంతీయ పార్టీల పరమావధి.

రాష్ట్రం దాటితే పనికిరాని ప్రాంతీయ పార్టీలు జాతీయ రాజకీయాలలో చక్రం తిప్పటానికి మరియు రాష్ట్రంలో అధికారం కోసం ఏమాత్రం భావసారూప్యంగాని, ఒకే విధమైన సిద్ధాంతాలు కానీ లేని పార్టీలతో జట్లు కడతాయి. కానీ! ఏ రెండు ప్రాంతీయ పార్టీలు కలిసి పని చేయలేవు.

ఎన్ని సంవత్సరాలైనా అవే నినాదాలు, అవే ఎత్తుగడలు. ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. ఏవి మన దేశంలో ప్రాంతీయ పార్టీల కోవకు చెందుతాయో?

2. జాతీయ పార్టీలు : మన దేశమంతా ఒకే జాతిగా భావిస్తూ, కీర్తిస్తూ, జాతివైభవం కోసం, జాతి అభివృద్ధి కోసం జాతీయ వాద సిద్ధాంతాలను రూపొందించుకొని, ఆ సిద్ధాంతాల ఆధారంగా రూపుదిద్దుకున్న పార్టీలనే జాతీయ పార్టీలుగా పేర్కొనవచ్చు.

దేశం మొత్తం అన్ని ప్రాంతాలలోను ప్రభావవంతంగా లేకపోయినా ప్రాంతం, భాష, కులం, మతం బేధాలు లేకుండా భారతీయులందరి అభ్యున్నతికోసం, దేశాభివృద్ధికోసం పనిచేసే పార్టీలే జాతీయ పార్టీలు.

ఒక వ్యక్తి ద్వారా కాకుండా దేశంకోసం, ధర్మంకోసం, మన జాతికోసం తపించే వ్యక్తుల సమూహం ఒక్క సిద్ధాంతానికి కట్టుబడి ఏర్పరచినదే జాతీయ పార్టీ. కాబట్టి అందులో వ్యక్తి పూజకుతావుండదు. కుటుంబ పాలన ఉండదు. బంధుప్రీతి, అవినీతి, అధికార దాహం అసలే ఉండదు.

పూర్తిగా ప్రతిభ, సిద్ధాంత నిబద్ధత, త్యాగం, జాతి శ్రేయస్సు ఆధారంగా వ్యవస్థ నిర్మాణం అయ్యే పార్టీలు ఈ కోవలోకి వస్తాయి. మనదేశంలో అటువంటి జాతీయ వాద పార్టీ ఏదో అర్థమయ్యే ఉంటుంది.

3. అంతర్జాతీయ పార్టీలు :- మన దేశంలో విదేశీయులతో ఏర్పాటు చేయబడినవి మరియు విదేశాల నుండి దిగుమతి చేసుకున్న పార్టీలను అంతర్జాతీయ పార్టీలుగా చెప్పుకోవచ్చు. ఈ పార్టీల యొక్క పుట్టుక విదేశాలలో ఉన్న పార్టీల సిద్ధాంతాలను యధాతదంగా కానీ పాక్షికంగా కానీ స్వీకరించి ఆ పార్టీల పేర్లకు మన దేశం పేరును జోడించి పెట్టబడతాయి.

అంతర్జాతీయ పార్టీల రూపకర్తలు ఈ దేశంతోను, ఈ దేశ సంస్కృతి, సంప్రదాయాలతోను ఏ విధమైన సంబంధం కలిగివుండరు. అదే విధంగా ఈ పార్టీల సిద్ధాంతాలు, లక్ష్యాలు ఆ విదేశాలలోని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను ప్రతిబింబించేవే తప్పా మన దేశ అవసరాలకు, మన సంస్కృతీ సాంప్రదాయాలకు ఏ విధమైన సంబంధం ఉండదు.

ఒకే సిద్ధాంతాన్ని వివిధ దేశాలలో విస్తరింపచేయడానికి అనుగుణంగా రూపొందించడం వల్ల ఆ సిద్ధాంతాల ఆధారంగా ఏర్పడిన రాజకీయ పార్టీలలో ఏ విధమైన జాతీయ భావాలు ఉండవు. జాతీయ భావాలు లేకపోవడం వల్ల మనదేశ సంస్కృతి, సాంప్రదాయాలకు, మనదేశ చరిత్రకు ఏ విధమైన ప్రాధాన్యత ఇవ్వవు సరికదా ఆపార్టీలు అంతర్జాతీయ సిద్ధాంతాలు, లక్ష్యాలకు అనుగుణంగా వీటిని వక్రీకరించి మార్చివేయడానికి శతవిధాల ప్రయత్నం చేస్తాయి.

ఇటువంటి అంతర్జాతీయ పార్టీలకు దేశాభివృద్ధి, దేశ ఔన్నత్యం అవసరం లేదు. అధికారమే పరమావధి దాని కోసం జాతి మొత్తాన్ని తాకట్టుపెట్టేస్తారు. వీరికి కావలసింది అంతర్జాతీయ గుర్తింపు, పేరు ప్రతిష్టలే తప్ప, దేశ ప్రయోజనాలు, దేశాభివృద్ధి కాదు. మన దేశంలోని అంతర్జాతీయ పార్టీలు ఏవో అర్థమయ్యే ఉంటాయి.

ఈ విధంగా మన దేశంలోని రాజకీయ పార్టీలు అన్నింటిని పై మూడు రకాలుగా విభజించవచ్చు.

మనదేశంలోను, రాష్ట్రంలోను ప్రస్తుతం ఉన్న పార్టీల పుట్టుక, చరిత్రను తెలుసుకోవడం, వాటి లక్ష్యాలు, సిద్ధాంతాలను అర్థం చేసుకోవడం ద్వారా ఏవి అంతర్జాతీయ పార్టీలో, జాతీయ పార్టీలో, ప్రాంతీయ పార్టీలో తెలుకోగలం.

ప్రతీ ఓటరుకు ఈ అవగాహన ఉన్నప్పుడు మాత్రమే దేశంకోసం, రాష్ట్రం కోసం తన ఓటును వేయగలడు.

అటువంటి రాజకీయ అవగాహన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలలో వచ్చినప్పుడు మాత్రమే ఈ దేశం కోసం, ఈ జాతి కోసం, ఈ ధర్మం కోసం ఏ పార్టీలు ఏర్పడ్డాయి? ఏ పార్టీలకు ఈ దేశంతోను, ఈ జాతితోను, ఈ ధర్మంతోను సంబంధం లేకుండా వారి అంతర్జాతీయ ఎజెండాను ఈ దేశంపై రుద్దడానికి ఏర్పడ్డాయి? ఏ పార్టీలు వ్యక్తిగతంగా వారు ఎదగడానికి అలాగే వారి కుటుంబం, కులం, వర్గం మాత్రమే బాగుపడడానికి ఏర్పడ్డాయి అనే విషయాలు అర్థం చేసుకోగలుగుతారు.

ఈ పరిశీలన, అవగాహన, చర్చ ప్రారంభమైతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కమలం వికశిస్తుంది.

అందుకు కమలం పార్టీ గట్టి ప్రయత్నమే చేయాలి. అధికార దాహంతో పొత్తులకై పాకులాడే పార్టీల ఉచ్చులో పడకుండా, కమలదళ నాయకులు ఒంటరిగా పోరాటం చేయాలి. "పోరాడితే పోయేదేమి లేదు, పొత్తులతో మాత్రం ఒరిగేదేమిటి?" వారిచ్చే పదిసీట్లలో ఉన్న పదిమంది నాయకులు పోటీచేసి నలుగురో! ఐదుగురో! గెలిచి, వాళ్ళముందు దండలు కట్టుకొని నుంచోవడం తప్ప చేయగలిగేది ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు కమలం పార్టీనుండి కోరుకునే ఒక్క పనినైనా సంకీర్ణ ప్రభుత్వంతో చేయించగలరా? ఆ అనుభవం ఇంతకు ముందే మీకుందిగా!?

అదే! పార్టీ అభిమానులను, వివిధ క్షేత్రాలలో పనిచేసే నాయకులను పార్టీలోకి ఆహ్వానించి, అన్ని స్థాయిలలో పార్టీని బలోపేతం చేస్తే, నేడు కాకపోతే రేపు పార్టీ బలపడుతుంది. అంతే తప్ప! ఎవరినీ పార్టీలోకి తీసుకోకుండా, పనిచేసేవాళ్ళని ప్రక్కకు లాగేస్తూ, ఒంటెత్తుపోకడలను స్థానిక, రాష్ట్రనాయకత్వం ప్రదర్శిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో కమలం ఎలా వికశిస్తుంది.....? (మిగతా రేపటి సంచికలో)

# కుటుంబీకుల కలవరం

- కావలి సంఘటన ప్రభావం
- విధుల్లోకి వెళ్లేందుకు బెంబేలు
- మొక్కుబడి అరెస్టులకే పరిమితం!
- శాశ్వత పరిష్కారానికి చర్యలేవి?




**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) లో పని చేస్తున్న డ్రైవర్ల భద్రతా సమస్య ప్రశ్నార్థకంగా మారింది. నిత్యం ప్రజల మధ్య విధుల్లో నిలిచే డ్రైవర్లకు, కండక్టర్లకు రక్షణ కరవైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో?, ఎలా ఉంటుందో? తెలియక వారంతా ఆందోళన మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. తాజాగా నెల్లూరు జిల్లాలోని కావలి దగ్గర ఆర్టీసీ బస్సు డ్రైవర్లపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటనతో సహచర ఉద్యోగులు కలవరపాటుకు గురవుతున్నారు. ఆర్టీసీడ్రైవర్ బీఆర్ సింగ్ (బొందిలి రామ్ సింగ్) తో పాటు మరో డ్రైవర్ శ్రీనివాసరావుపై జరిగిన దుండగుల దాడి సహచర ఉద్యోగులనూ బెంబేలెత్తిస్తోంది. డ్రైవర్లు, కండక్టర్లు సైతం విధుల్లో పాల్గొనేందుకు వారి ఆత్మస్థైర్యం దెబ్బతింటోంది. వారంతా బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ బీఆర్ సింగ్‌ను కొంతమంది వ్యక్తులు దారుణంగా దాడి చేసిన సంఘటన రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితికి అద్దంపడుతోంది. విధి నిర్వహణలో భాగంగా రోడ్డుపై ఉండటంతో హారన్ మోగించిన డ్రైవర్ బీఆర్ సింగ్‌ను వెంటాడి మరీ ఆ ప్రాంత వ్యక్తులు బస్సులో నుంచి లాగి కింద పడేసి కొట్టిన తీరుతో సామాన్య ప్రజలు సైతం భయపడుతున్నారు. ఒక్క ఆర్టీసీ సిబ్బందే కాకుండా, మిగిలిన ఉద్యోగులు, కుటుంబ సభ్యులలోనూ ఆందోళన నెలకొంది.

**డ్రైవర్లకు భద్రత ఏదీ?**

కావలి సంఘటన అనంతరం ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు విధులు నిర్వహణలో భద్రత అంశం మరోసారి తెరపైకి వస్తోంది. నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ నుంచి విభజిత ఆంధ్ర ప్రదేశ్ వరకు ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్ల పైన, కండక్టర్ల పైన అనేక దాడులు, అవమానాలు, బరితెగంపు చర్యలకు పాల్పడిన సంఘటనలున్నాయి. మదనపల్లిలో నెలల క్రితం ముగ్గురు ఆకతాయిలు ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేశారు. గత ఏడాది విజయవాడలో డ్రైవర్‌పై మహిళ ఘోరంగా దాడి చేసింది. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం చొరవ తీసుకుని దుండగులను కఠినంగా శిక్షించి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉంది. వాటిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి యూనియన్లు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇలాంటి సంఘటనలు ఉత్పన్నమవుతున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామంటూ ఆర్భాటంగా సీఎం జగన్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోంది. వారికి రావాల్సిన ఉద్యోగపరమైన ప్రయోజ నాలను ఇంతవరకు చేకూర్చ లేదు. సాధారణ ఉద్యోగుల ప్రయోజ నాల తరహాగా, ఆర్టీసీ సిబ్బందికి కల్పించడంలో ఈ ప్రభుత్వం వెనుకబాటుకు గురైంది. ఎంతసేపు ఉద్యోగులను ఆర్టీసీలో విలీనం చేశామనే మాట మినహా, వారి భద్రత పైన, వారి సంక్షేమం పైన ఈ ప్రభుత్వం దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లపై దాడులను నియంత్రించేందుకు ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చట్టం తేవాల్సి ఉంది.

**ప్రభుత్వ తీరుపై విపక్షాల ఆగ్రహం**

కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వ స్పందించిన తీరు సరిగ్గా లేదని విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఆర్టీసీ డ్రైవర్లపై దాడిని నిరసిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు ఏపీపీటీడీ ఆర్టీసీ యూనియన్ పిలుపునిచ్చింది. పెద్ద ఎత్తున ఉద్యమ కార్యచరణకు సన్నద్ధమైంది. దీంతో పోలీసు శాఖ ఆలస్యంగా స్పందించి కొంతమందిని అరెస్ట్ చేసినట్లు హడావిడిగా ప్రకటించింది. మిగిలిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు నెల్లూరు ఎస్పీ తిరుమలేశ్వర్ తెలిపారు. డ్రైవర్లను చితకబాదిన సంఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. లేకుంటే సాధారణ సంఘటనగానే భావించి మౌనంగా ఉండిపోయేదని ఆర్టీసీ ఉద్యోగులు మండిపడుతున్నారు. అయితే, ప్రభుత్వం, పోలీసు శాఖ మొక్కుబడి చర్యలకే పరిమితమైంది.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కావలి తరహా సంఘటన భవిష్యత్తులో జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు మానసిక స్థైర్యం నింపేలా ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉంది.

## విజయనగరం ఆసుపత్రిలోని బాధితులకు సిపిఎం నేతల పరామర్శ



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** విజయనగరంలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో దాదాపు 100మందికి పైగా ప్రజలు గాయాలపాలయ్యారు. బాధితులంతా విజయనగరం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం రైలు ప్రమాద బాధితులను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు. జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, తదితరులు పరామర్శించారు. ఆదివారంన సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు జి.శ్రీనివాస్ పరామర్శించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు చేరుకొని క్షతగాత్రులకు అవసరమైన రక్తం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు.

## బెంగళూరులో అగ్నిప్రమాదం.. దగ్ధమైన ప్రైవేట్ బస్సులు



**బెంగళూరు:** బెంగళూర్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పలు ప్రైవేట్ బస్సులు దగ్ధమయ్యాయి. వీరభద్రనగర్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సుమారు ఆరు బస్సులు దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక యంత్రాలు చేరుకున్నాయని, మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించిందని అన్నారు. గ్యారేజీలో చెలరేగిన మంటలు బస్సులకు అంటుకుని ఉంటాయని అనుమానిస్తున్నారు. అయితే ఈ ప్రమాద విచారణ చేపట్టాల్సి ఉందని అధికారులు తెలిపారు.

# పిఎం స్వనిధి పథకంతో ఆర్థిక అభివృద్ధి




చిరు వ్యాపారులకు అండగా, వారి వ్యాపారాల్లో ఎదురవుతున్న ఆర్థిక సవాళ్ళను సునాయాసంగా ఎదుర్కోడానికి మూడేళ్ళ క్రితం ప్రవేశపెట్టిన పిఎం స్వనిధి పథకం బలహీన వర్గాల కుటుంబాల్లో ఆనందపు వెలుగులు నింపుతోంది. ఇది చిరు వ్యాపారుల్లో అన్ని వర్గాల వారికి ఉద్దేశించినదే అయినప్పటికీ జనరల్ క్యాటగిరీ కన్నా మిగిలిన వెనుకబడ్డ బలహీన వర్గాల వారు ఎక్కువగా లబ్ది పొందడంతో అది వారి భవిష్యత్ కి ఒక భరోసా ఇస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన స్వనిధి పథకం వల్ల 75 శాతం మంది నాన్-జనరల్ కేటగిరీ వారు లబ్ది పొంది, వ్యాపారాలను సుస్థిరం చేసుకుంటున్నారని ఎస్‌బిఐ తాజాగా ఒక నివేదికలో వెల్లడించింది. దీనికి సంబంధించి దూరదర్శన్ అందిస్తున్న ప్రత్యేక కథనం...

2020లో మోదీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి స్వనిధి పథకం, పట్టణ వీధి వ్యాపారుల కోసం ఉద్దేశించిన ఒక సూక్ష్మ రుణ పథకం. ఇది 50,000 రూపాయల వరకు పూచీకత్తు రహిత రుణాలను అందిస్తుంది. పీఎం స్వనిధి అమలు జరుగుతున్న తీరుపై ఎస్‌బిఐ ఇటీవలి పరిశోధన చేసింది. మార్కెట్ లో కింద స్థాయి వరకు సాధికారత విస్తరణ వల్ల దేశ సామజిక స్థితిగతుల్లోనే మార్పులను, పీఎం స్వనిధి ప్రభావాన్ని ఎస్‌బిఐ తన నివేదికలో విశ్లేషించింది. ప్రధానమంత్రి స్వనిధి అట్టడుగున ఉన్న పట్టణ సూక్ష్మ వ్యాపారవేత్తలతో అనుసంధానం అయింది. సామజిక అడ్డంకులను సైతం అధిగమించి గొప్ప ఫలితాలను ఇస్తోంది అని ఎస్‌బిఐ పేర్కొంది. దాదాపు 75 శాతం మంది రుణ లబ్ధిదారులు నాన్-జనరల్ కేటగిరీ నుండి ఉన్నారని, ఇది గొప్ప మార్పునకు నిదర్శనమని నివేదిక స్పష్టం చేసింది. దానిలో 44 శాతం మంది ఓబిసిలు ఉన్నారని ఎస్‌బిఐ నివేదిక వెల్లడించింది. ఈ పథకం మొత్తం పంపిణీలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వాటా 22 శాతం కాగా, మొత్తం లబ్ధిదారుల్లో 43 శాతం మంది మహిళలు ఉన్నారని నివేదిక పేర్కొంది. ఈ విధంగా మహిళల వాటా పెరగడం పట్టణ మహిళల వ్యవస్థాపక సామర్థ్యాల సాధికారతను సూచిస్తుందని ఎస్‌బిఐ తెలిపింది.

పెర్సిస్టెన్సీ రేషియో అంటే..2వ సారి రుణం తీసుకోడానికి మొదటి రుణాన్ని సత్వరమే తిరిగి చెల్లించడం ఎక్కువగా కనిపించిందని, ఇది పీఎం స్వనిధి పథకంలో మరో ఆసక్తికర పరిణామమని నివేదిక వెల్లడించింది. రుణాలను సక్రమంగా సమయానికి తిరిగి చెల్లించే వారికి ఇది ప్రేరణగా నిలుస్తుందని స్పష్టం చేసింది నివేదిక.

ఇప్పటి వరకు 53 లక్షల మంది వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తూ మూడు విడతల్లో దాదాపు 70 లక్షల రుణాలను బ్యాంకులు పంపిణీ చేసాయి. వీటి విలువ మొత్తం విలువ రూ.9,100 కోట్లు. పీఎం స్వనిధి రుణగ్రహీతలలో 65 శాతం మంది 26 నుండి 45 సంవత్సరాల వయస్సు గల వారు ఉన్నారు. ఇలా పీఎం స్వనిధి పథకం చిరు వ్యాపారాలకు అండగా ఉంటూ... పేద, వెనుకబడిన బలహీన వర్గాల్లో ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోంది.

# స్టాఫ్ నర్సుల పోస్టుల కోసం నకిలీ సర్టిఫికెట్స్ 'మాయ' జాలం

**అమరావతి, (విశాఖ సమాచారమ్):** స్టాఫ్‌నర్స్ పోస్టింగ్స్ లో కోవిడ్ సర్టిఫికెట్స్‌తో 'మాయ' చేయాలను కున్న నకిలీ అభ్యర్థుల కథ అడ్డం తిరిగింది. స్టాఫ్ నర్స్ పోస్టులకు సంబంధించి కోవిడ్ సమయం లో విధులు నిర్వర్తించినట్లు ఫేక్ సర్టిఫికెట్లు పెద్దఎత్తున పెట్టారనే అభియోగాలు ఉన్నాయి. దళారుల డైరెక్షన్లో అత్యధిక శాతం అభ్యర్థులు తాము కోవిడ్ సమయంలో ప్రభుత్వాసుపత్రు ల్లో విధులు నిర్వర్తించినట్లు సర్టిఫికెట్లు జత చేశారనేది బహిరంగ రహస్యం. ఆదివారం జోన్ 2 పరిధిలోని మెరిట్ లిస్ట్‌ను ప్రకటించారు. విశాఖపట్నం, గుంటూరు, కడప రీజియన్లలో మరో రెండు రోజుల్లో జాబితాలను ప్రకటించేందుకు ఆర్డీ కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగు రీజియన్ల పరిధిలో బోగస్ కోవిడ్ సర్టిఫికెట్లతో దొడ్డిదారిన పోస్టింగ్స్ దక్కేలా దళారులు పావులు కదిపినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆర్డీ కార్యాలయ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కోవిడ్ సర్టిఫికెట్ల విషయంలో రుజువులు చూపాలంటూ ఆంక్షలు విధించారు. అభ్యర్థులు జత చేసిన కోవిడ్ సర్టిఫికెట్ అసలా లేక నకిలీనా అని తలుసుకొనేందుకుగాను ప్రభుత్వాసుపత్రుల్లో వారు పనిచేసిన కాలానికి సంబంధించి అటెండెన్స్, శాలరీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు ఈనెల 1వ తేదీ లోపు సంబంధిత అధికారికి చూపాలంటూ రాజమండ్రి ఆర్డీ కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కౌన్సిలింగ్‌లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన తరువాత వారికి పోస్టింగ్స్ సమయంలో వారు సమర్పించిన ఆసుపత్రుల నుంచి పూర్తి నివేదిక తెప్పించుకొని పోస్టింగ్స్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కోవిడ్ సర్టిఫికెట్ లేదా బ్యాంక్ అకౌంట్, అటెండెన్స్‌లో మాయ చేసినట్లు రుజువైతే సంబంధిత అభ్యర్థిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

**మేనేజ్ చేస్తామంటూ అదనపు వసూళ్ళు**

స్టాఫ్ నర్స్ పోస్టింగ్ ఇప్పిస్తామంటూ దళారులు దందాకు తెరలేపారు. ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కాంట్రాక్ట్ ప్రాతిపదినక విధులు నిర్వహించే స్టాఫ్ నర్సుకు రూ.38,720 జీతం కావడంలో ఈ పోస్టులకు భారీగా డిమాండ్ ఏర్పడింది. నోటిఫికేషన్ వస్తోందని ముందస్తు సమాచారం అందుకున్న దళారీ బ్యాచ్ మూడు నెలల ముందు నుంచే రంగంలోకి దిగి అభ్యర్థుల నుంచి దండిగా వసూళ్ళు చేశారని తెలుస్తోంది. కోవిడ్ సమయంలో ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించినట్లైతే ఆరు నెలలకుగాను ఐదు మార్కులు, ఆ తరువాత అదనంగా ప్రతి నెలకు 0.83 మార్కుల చొప్పున లెక్కించి మొత్తంగా వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను అధికారులు రూపొందించారు. తమ వద్దకు వచ్చిన అభ్యర్థుల దరఖాస్తుకు కోవిడ్ సర్టిఫికెట్‌ను జత చేసి అప్లై చేయించిన దళారీ బ్యాచ్ ఇప్పుడు ఏం చేయాలనే దానిపై భారీ స్కెచ్ వేసే పనిలో పడ్డట్లు తెలుస్తోంది. ఇందుకు కొందరు నర్సింగ్ యూనియన్ నాయకుల సహకారంలో ఆర్డీ కార్యాలయ అధికారుల్ని మేనేజ్ చేసేందుకు ముమ్మరంగా పావులు కదుపుతున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలుస్తోంది. కోవిడ్ బోగస్ సర్టిఫికెట్ల సూత్రదరులైన దళారీ బ్యాచ్ ఒక స్టాంప్ తయారు చేసి ఆసుపత్రి సూపరింటెండెంట్, ఎస్ఆర్ఎం, ఆర్ఎంఓ సంతకాలను ఫోర్జరీ చేసి ఒక్కో సర్టిఫికెట్‌కు అభ్యర్థుల నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారనే అభియోగాలు ఉన్నాయి. ఇప్పుడు బ్యాంక్ స్టేట్‌మెంట్, అటెండెన్స్ విషయంలో అధికారుల్ని మేనేజ్ చేయాలంటూ అభ్యర్థుల నుంచి మరో లక్ష గుంజే పనిలో పడ్డట్లు తెలుస్తోంది.

**కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు**

కాంట్రాక్ట్ ప్రాతిపది కన రాష్ట్రంలోని నాలుగు జోన్ల పరిధిలో 434 మంది స్టాఫ్ నర్సుల భర్తీకి పబ్లికెహెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ గత నెల 22వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. జోన్-1లో 186, జోన్-2లో 220, జోన్-3లో 34. జోన్-4లో 94 పోస్టుల భర్తీకి దరఖాస్తుల్ని ఆహ్వానించారు. ఖాళీల సంఖ్యను డిపార్ట్ మెంట్ అవసరాలను బట్టి పెంచడం లేదా తగ్గించడం జరుగుతోందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ మరియు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తులు అందజే యడానికి తుది గడువగా నిర్ణయించగా రాజమహేంద్రవరం, విశాఖపట్నం, గుంటూరు, కడప లోని ఆర్డీ కార్యాలయాలకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు అందాయి. 434 పోస్టులకుగాను సుమారు 25 వేల దరఖాస్తులు అందాయంటే ఈ పోస్టులకు ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతోంది. రాజమండ్రి జోన్ మెరిట్ జాబితా ప్రకటించగా, విశాఖపట్నం, గుంటూరు, కడప జోన్ల పరిధిలో ఒకటి రెండు రోజుల్లో జాబితాలను ప్రకటించనున్నారు.

ఈక్రమంలో బోగస్ సర్టిఫికెట్లపై అధికారులు నిస్పక్షపాతంగా విచారణ చేస్తే తప్ప అర్హులకు న్యాయం జరగదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో బోగస్ కోవిడ్ సర్టిఫికెట్లతో పలువురు పోస్టింగ్స్ దక్కించుకున్నారన్నది బహిరంగ రహస్యం. వీటిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలన్న డిమాండ్ ఉన్నప్పటికీ ఆర్డీ కార్యాలయ అధికారులు సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో నకిలీ సర్టిఫికెట్లతో ఎంచక్కా ఉద్యోగాలు చేస్తున్నారు. వీటిపై కూడా సమగ్ర దర్యాప్తు చేసినట్లైతే అర్హులకు మరింత న్యాయం జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఫెవికాల్ రెలామ్ తో ఫర్నిచర్‌కు జీవం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పండుగల సమయంలో మనం గోడలకు పెయింటింగ్ చేయిస్తాం. కానీ ఫర్నిచర్ ను పట్టించుకోం. చాలా సందర్భాలలో ఫర్నిచర్ను పండుగ సీజన్‌లో అస్సలు పట్టించుకోరు, ఎందుకంటే, ఇది ఖరీదైనదిగా పరిగణించడమే. ఇంటి అలంకరణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఫెవికాల్ రెలామ్‌తో పండుగ సీజన్‌లో ఫర్నీచర్‌ని పునరుద్ధరించవచ్చు.

ఫెవికాల్ రెలామ్‌ని ఉపయోగించి లామినేట్‌పై లామినేట్‌ను అతికించవచ్చు. తద్వారా ఫర్నిచర్ పునరుద్ధరణ ప్రక్రియను సులభతరం చేయవచ్చు. ఫెవికాల్ రెలామ్ అడ్హెసివ్ రెండు గంటల్లో తక్షణ హోల్డింగ్, ప్రాసెసింగ్ ఇస్తుంది. దీనికి వాసన ఉండదు. ఇది ఉపయోగించడం సులభం. ఉపయోగించడానికి ముందు మిక్సింగ్ అవసరం లేదు. ఫెవికాల్ రెలామ్ లామినేట్ సజావుగా ఉండేలా చేస్తుంది. ఎలాంటి గందరగోళం లేకుండా ప్రొఫెషనల్ ఫినిషింగ్ ఇస్తుంది. ఫెవికాల్ రెలామ్‌ని ఉపయోగించి, పాత లామినేట్‌పై నేరుగా కొత్త లామినేట్‌ను అతికించవచ్చు. తద్వారా వాటిని వైబ్రంట్ స్టైలిష్‌గా చూడవచ్చు.

సొల్యూషన్స్‌లో విశ్వసనీయమైన పేరు ఫెవికాల్ రెలామ్. ఫర్నిచర్‌ను మార్చడానికి అనేక రకాల అవకాశాలను అందిస్తుంది. పాత కిచెన్ క్యాబినెట్‌లు, అల్మారాలకు ఆధునిక టచ్ ఇవ్వాలనుకున్నా లేదా అలసిపోయినట్లుగా కనిపించే కాఫీ టేబుల్‌ను అలంకరించాలనుకున్నా, ఫెవికాల్ రెలామ్ నమ్మదగిన, ఉపయోగించడానికి సులభమైన పరిష్కారాన్ని అందిస్తుంది.

# తప్పులు బయట పడతాయని సీఎంను వద్దన్నారు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఘటనా స్థలానికి వస్తే, శాంతి భద్రతల సమస్యతో పాటు సంఘటనా స్థలంలో వివిధ రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాల నుండి వచ్చే వ్యతిరేకత నుంచి రైల్వే శాఖా తప్పించుకొని, సమస్య తీవ్రతను తగ్గించేందుకు మీడియాలో వ్యతిరేకకథనాలు రాకుండ జాగ్రతగా పడ్డట్టు తెలుస్తోంది,

రైల్వేఅధికారుల నిర్లక్ష్యానికి 14 ప్రాణాలు గాలిలోకలిసి పోయిన తూర్పురైల్వేఅధికారులు తమ తప్పులు బయటికి రాకుండ ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకావటంపై ప్రజలు చర్చించుకుంటున్నారు, గతం లో ఒరిస్సా బాలాసోర్ రైల్వే ప్రమాదంలో ప్రదాని సహ రైల్వేమంత్రి అక్కడనుంచి ట్రాక్ మరమత్తులు చేసినప్పుడు లేని ఇబ్బంది, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రమాదం జరిగిన స్థలానికి వస్తే. ట్రాక్ పునరుద్ధరుణ పనులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేయటం విడ్డూరంగా ఉంది,

రైల్వే అధికారుల విజ్ఞప్తితో ప్రమాద ఘటనా స్థల పరిశీలన కార్యక్రమం రద్దు చేసిన జిల్లా యంత్రాంగం,

నేరుగా విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన సీఎం జగన్మోహనరెడ్డి ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగు సంవత్సరాలలో నేరుగా ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్లిన దాఖలాలు లేవు. ఆయన మొదటిసారిగా విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం తీవ్రతను గ్రహించి ప్రజల అభీష్టం మేరకు కుటుంబ పెద్దలను కోల్పోయిన తీవ్రంగా గాయపడ్డ కుటుంబాలను పరామర్శించేందుకు సంఘటనా స్థలానికి చేరుకున్న ముఖ్యమంత్రి పర్యటనను చివరి నిమిషంలో రైల్వే అధికారులు అడ్డుకున్నారు.

# చెరువుల్లో నీటి నిల్వలు ఉండటానికి ప్రణాళికాసిద్ధం చేయాలి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని గోపాలపురం , అక్కిరెడ్డిపాలెం గ్రామాలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా పనుల గుర్తింపు ప్రణాళిక ప్రక్రియ 2024 -2025 ఆర్థిక సంవత్సరం గ్రామ సభ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది .ఈ సభకి ముఖ్యఅతిథిగా మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు హాజరు అయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఏఏ పనులు చేయాలి ఏ విధంగా చేయ్యాలి అని , గ్రామంలో ప్రతి పనిని గుర్తించి చేయాలని చెరువుల వాటర్ నిల్వ ఉండడానికి కొండల మీద ట్రంచులు అలాగే ప్రతి దగ్గర ఖాళీ ప్రదేశంలో పచ్చని మొక్కలను పెంచడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని. వేసిన మొక్కలను సంరక్షించడానికి ఒకరిని నియమించి వాటి సంరక్షణ బాధ్యతలు ఆ మనిషికి అప్పచెప్పాలని చెప్పారు. అలాగే గ్రామంలో గ్రామ చిత్రపటాన్ని వేసి వాటి వివరాలను ఏపీవో ఎంపీపీ వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, సాలాపు శాంతి సూరిప్పారావు, ఎన్ఆర్జిఎస్ ఏపీవో సుప్రియ, వార్డు మెంబర్లు, గ్రామ కార్యదర్శి గుణలక్ష్మి, వాలంటీర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ యూత్ ఎక్ఛ్సేంజ్ ప్రోగ్రాం పోస్టర్ను ఆవిష్కరించిన ఎంపీ సత్యవతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** భిన్నత్వంలో ఏకత్వం భావన, దేశ సాంస్కృతిక, సంప్రదాయ వారసత్వంపై అవగాహన కల్పించడానికి 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రొగ్రాం దోహదప డుతుందని లోక్‌సభ సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి పేర్కొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం, కేంద్ర హెూం శాఖ సంయుక్త నిర్వహణలో అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఇలో నవంబర్ 2 నుంచి జరగనున్న 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రొగ్రాం పోస్టర్‌ను స్థానిక వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు హాలులో ఆదివారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక పురోగతిలో గిరిజన యువతను భాగస్వాములను చేయడం, భావోద్వేగ సంబంధాలను పెంపొందించుకోవడానికి 'ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రొగ్రాం సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ జి. మహేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు, కాండ్రేగుల వెంకటరమణ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మీగడ పరాషర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పూర్వపు మేనేజర్ బుద్ధ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ లో ప్రీ హాలోవీన్ రోజు వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ లో నిర్వహించిన ఆత్మల ఘోష వేడుకలు కార్యక్రమం అద్భుతంగా జరిగింది. సీతంపేట రిలయన్స్ బంక్ పక్కన ఉన్న insd సంస్థలో చదువుతున్న విద్యార్థులు అధునాతన టెక్నాలజీతో అద్భుతమైన డిజైన్లతో చక్కని అభినయం చూపించారని డైరెక్టర్ హేమ సుందర్ టెంక కొనియాడారు ముఖ్యంగా ఇవి ఇంగ్లీష్ దేశాల్లో పాటించే సంప్రదాయం అని అవగాహన కల్పిస్తూ మంచి కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఆత్మలను సంతృప్తిరిచే వేడుకలను చాలా ఆనందంగా ఉందని ముఖ్యంగా అమెరికా వంటి దేశాల్లో చేస్తారని ఆ వేడుకలను అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దిన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో Director of INSD హేమ సుందర్ టెంక , ఫ్యాషన్ డిజైనింగ్ HOD అమృత, ఇంటీరియర్ డిజైనింగ్ HOD సునయన, HR డైసీ ఫ్లోరెన్స్ విద్యార్థులు హ్యాండ్ మేడ్ వర్క్స్ తో హ్యాండ్మ్యాన్ వైట్ క్రియేట్ చేశారు.

# కోస్తా జిల్లాల యోగా పోటీలలో ప్రథమ స్థానంలో కోన అభినవ్ జోసెఫ్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఉత్తర కోస్తా జిల్లాల యోగా పోటీలు నిన్న యోగా అసోసియేషన్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ యోగా, ఆంధ్రా యూనివర్సిటీ సంయుక్తంగా విశాఖపట్నం లోని యోగా విలేజ్ లో జరిగాయి. మొత్తం 14 జిల్లాల నుంచి వివిధ కేటగిరీ లో దాదాపుగా 1000 మంది పాల్గొన్నారు. 11 నుంచి 14 సంవత్సరం ల లో 60 మంది పాల్గొన్నారు. ఈ కేటగిరీ లో కోన అభినవ్ జోసెఫ్, ప్రకాష్ రావు, సుధారాణి దంపతుల కుమారుడు ప్రథమ స్థానంలో నిలిచేడు. బహుమతి ని గౌరవ అతిథులు శ్రీ యోగానంద భారతి స్వామీజీ చేతుల మీదుగా తీసుకున్నారు. ముఖ్య అతిధిగా పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డి, వైస్ ఛాన్సలర్, ఆంధ్రా యూనివర్సిటీ హాజరయ్యారు.

అభినవ్ జోసెఫ్ శ్రీమతి రాజా సరోజిని దేవి ,లవ్ అండ్ కేర్ యోగా సెంటరు ద్వారా శిక్షణ పొందాడు. ఈ అబ్బాయి క్రీస్తు జయంతి ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నాడు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సభ్యుడు గా ఉన్న అభినవ్ జోసెఫ్ కి కన్వీనర్ కె. సుశీల అభినందనలు తెలియజేశారు.

# టీడీపీ ఆధ్వర్యంలో నిజం గెలవాలి...కళ్ళు తెరిపిద్దాం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు చంద్రబాబు నాయుడుకి విధించిన అక్రమ రిమాండ్ ను నిరసిస్తూ నారా భువనేశ్వరి చేపడుతున్న నిజం గెలవాలి యాత్రలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పట్టణంలో గల టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిజం గెలవాలి..చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలి అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారంతా కళ్ళకు నల్లరిబ్బలను కట్టుకొని నిజం గెలవాలి చంద్రబాబు నిర్దోషిగా బయటకు రావాలి అంటూ నినాదాలు చేసారు.ఈ సందర్భంగా పప్పల చలపతిరావు,ప్రగడ నాగేశ్వరరావులు మాట్లాడుతూ నిజం గెలవాలి నిర్దోషిగా చంద్రబాబు నాయుడు బయటకు రావాలని ఈ నినాదాలు ముఖ్యమంత్రికి వినిపించే విధంగా చెవులకు తాకాలి అతనికి జ్ఞానోదయం కలుగులుతూ జగన్మోహన్ రెడ్డి కళ్ళు తెరవాలన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో ఎవరు ఊహించని విధంగా అంచనాలను మించి తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని, నిజం గెలుస్తుంది టీడీపీ విజయం సాధిస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ నాగేశ్వరావు, అనకాపల్లి పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయబాబు,పట్టణ టౌన్ పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ,కార్యదర్శి ఆడారి రమణబాబు,రైతు అధ్యక్షులు కొఠారు సాంబశివరావు, క్లస్టర్ ఇంచార్జ్ బొద్దపు శ్రీనివాసరావు,పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గొర్లె బాబురావు, జనసేన టౌన్ పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీను, రూరల్ అధ్యక్షులు లాలం సోమునాయుడు, యూనిట్ ఇన్చార్జ్ కరణం రవికుమార్, ప్రగడ రమణ, నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నిజం గెలవాలి'లో భాగంగా హైవే16లో మోకాళ్లపై నిరసన



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావు ఆదేశాల మేరకు నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీపీ, పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయరామరాజు సోమవారం నాడు పులపర్తి ఎన్ హెచ్ 16పై నిరసన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏటికొప్పాక మాజీ సర్పంచ్ కాండ్రకోట చిరంజీవి,మాజీ ఎంపిటిసి పూడి రామకృష్ణ, పిఎన్ఆర్ పేట యూత్ లీడర్ ఎడ్ల చిన్న బాబు,ఎడ్ల నారాయణరావు, మొగ్గ బాబురావు, తోట వెంకటి, కంబాల శ్రీను, కొసిరెడ్డి వెంకటేశ్వరరావు, మొగిలి రమణ, బయ్యవరం మాజీ సర్పంచ్ గెంజి శ్రీనివాసరావు, పులి దేవుళ్ళు, సిద్ధ రమణ, పొందలి కనక తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాదం.. బాధితులకు టీడీపీ అండ



అమరావతి: విజయనగరం జిల్లా, కంటకాపల్లి దగ్గర జరిగిన రైలు ప్రమాద ఘటన చాలా బాధాకరమని, బాధితులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ సహాయక చర్యల్లో పాల్గొనేందుకు రెండు టీడీపీ బృందాలను ఏర్పాటు చేశామని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలను టీడీపీ బృందం సభ్యులు పరామర్శించి అండగా నిలుస్తారన్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ శ్రేణులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# స్పందనకు 445 దరఖాస్తులు, ఫిర్యాదులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజలనుండి వినతులు ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జెడ్ పి సీఈవో పోలినాయుడు, సుజల స్రవంతి ఎస్డిసి కే. రమామణి కూడా వినతులను స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి 445 దరఖాస్తులు ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతు భరోసా.. అంగన్వాడి కేంద్రాల ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం ప్రారంభించారు. రేబాక గ్రామంలో 21.80 లక్షల రూపాయలకు వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. అలాగే కాపుశెట్టివాని పాలెం గ్రామంలో 12 లక్షల రూపాయలతో ఖర్చుతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, వీటిలో చాలావరకు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదని అమర్నాథ్ చెప్పారు. అనకాపల్లిని అందాల నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో తాను పనిచేస్తున్నానని అమర్నాథ్ చెప్పారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు తనకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

# భగవంత్ కేసరి విజయోత్సవ వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** యువరత్న నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా 150 కోట్లు కలెక్షన్లు సాధించిన సందర్భంగా ఆదివారం రాత్రి శ్రీ రామచంద్ర థియేటర్ లో పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు శ్రీ పోలిమేర నాయుడు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి అభిమానులకు పంచిపెట్టి ఒకరికి ఒకరు అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెతకంశెట్టి శ్రీనివాసరావు మల్ల గణేష్ సూరిశెట్టి నూక శివ అప్పారావు గుంప మహేష్ దాడి జగన్నాథ రావు సూరిశెట్టి బల్లమ్మ ఇల్లపు నూకేశ్వరరావు విల్లూరి అప్పలనాయుడు బుద్ధ విశ్వనాథం ఆడారి గంగాధరం షేక్ ఖాదర్ వల్లి జోడ ఈశ్వరరావు వేణు సుందర్రావు తిప్పాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# రైలు ప్రమాదం పై ప్రధాని దిగ్భ్రాంతి




**విజయనగరం (విశాఖ సమాచారమ్):** విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన.. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ప్రధాని మోడీ మాట్లాడారు.

మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రధాని మోడీ ప్రకటించారు. గాయపడిన వారికి రూ.2లక్షల 50 వేల సాయం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ దుర్ఘటనపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడారు. ఎప్పటికప్పుడు పరిస్థితి పై ఆరా తీస్తున్నారు.

# రైలు ప్రమాదంపై స్పందించిన స్టాలిన్



రైలు ప్రమాదం ఘటన తనను కలచివేసిందని స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాణ్యమైన వైద్య సహాయన్ని అందించాలని కోరారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటన సంభవించిన కొద్ది నెలల వ్యవధిలో అలాంటి ప్రమాదమే మళ్లీ చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు.

దేశంలో లక్షలాదిమంది తమ ప్రయాణాల కోసం రైల్వేలపై ఆధారపడుతున్నారని గుర్తు చేశారు. ప్రజా రవాణాలో అత్యంత కీలకమైన రైల్వేల్లో తరచూ ఇలాంటి ప్రమాదాలు సంభవించడం.. ప్రమాద ఘంటికలను సూచిస్తోందని స్టాలిన్ చెప్పారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం.. కాలానుగుణంగా రైల్వే నెట్‌వర్క్ ఆధునికీకరణ, భద్రత చర్యల పెంపుపై నిర్ణయాలను తీసుకోవాలని స్టాలిన్ సూచించారు. మున్ముందు రైలు ప్రమాదాలు జరక్కుండా నివారించడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. రైల్వే మంత్రిత్వ శాఖ.. తన భద్రత చర్యలను అత్యవసర పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మరింత మెరుగుపర్చుకోవాలని చెప్పారు. తరచూ సంభవించే ప్రమాదాల వల్ల రైల్వే వ్యవస్థపై ప్రయాణికు తమ విశ్వాసాన్ని కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

# ఐరాసలో ఓటింగ్ కు భారత్ గైర్హాజరుని ఖండించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ప్రపంచంలో హింసకు స్థానం లేదని కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియాగాంధీ జాతీయ మీడియాతో పేర్కొన్నారు. హమాస్ దాడులను తమ పార్టీ ఖండిస్తున్నట్లు మరుసటి రోజే ప్రకటన విడుదల చేశామని అన్నారు. హమాస్ దాడులకు ప్రతిగా విషాదం చోటుచేసుకుందని, ఇజ్రాయిల్ గాజాపై చేపడుతున్న ప్రతీకార దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా వేలాది మంది పౌరులు మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా రాష్ట్ర సార్వభౌమ, స్వతంత్ర, భద్రత కోసం ఇజ్రాయిల్‌తో శాంతి చర్చలు జరపాలని తమ పార్టీ దీర్ఘకాలంగా కోరుకుంటోందని అన్నారు. ఇజ్రాయిల్ జరుపుతున్న అమానవీయ దాడులను మనమందరం సమిష్టిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపునిచ్చేందుకు, మనమందరం సమిష్టిగా మేల్కొనేందుకు ఇంకా ఎంతమంది ప్రాణాలు బలికావాలని ప్రశ్నించారు.



ఇటీవల గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఆపాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ హమాస్ మధ్య తక్షణ, స్థిరమైన సంధి, శతృత్వ విరమణకు పిలుపునిచ్చేలా ఐక్యరాజ్యసమితి తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరు కావడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

# రైలు ప్రమాదంలో మరణించిన మృతుల వివరాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారి వివరాలను పక్కగా సేకరించేందుకు అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ ఘటనలో 15 మంది మృతి చెందినట్టు గుర్తించిన అధికారులు, వారిలో 12 మంది వివరాలను సేకరించారు. అలాగే 60 మంది వరకూ గాయపడినట్టు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. క్షతగ్రాతులను తక్షణ వైద్యసేవల నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు. ఇప్పటికే 40 మంది వరకూ విజయనగరం జిల్లాలో చేర్చగా.. పది మంది వరకూ కేజీహెచ్‌కు తరలించినట్టు సమాచారం. అదే విధంగా మృతులను గుర్తించి ఆయా మృతదేహాలను ఆరింటిని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో, ఒక మృతదేహాన్ని మిమ్స్‌లో, ఏడు మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అయితే బోగీల కింద ఇంకా మృతదేహాలు ఉన్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. అయితే ఇదే సమయంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మరో వైపు విశాఖ కేజీహెచ్‌కు తరలించిన క్షతగ్రాతులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యసేవలందిస్తున్నారు

**రైలు ప్రమాదలో మరణించిన.. మృతుల వివరాలు..**

చీపురుపల్లి గ్రామీణం: విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఘటనలోలో 15 మంది మృతిచెందగా.. 54 మంది గాయపడినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బాధితులను ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్య సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.

మరోవైపు 13 మృతదేహాలను విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో.. మరో మృతదేహాన్ని మిమ్స్ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. మృతి చెందినవారిలో ఇప్పటి వరకు 11 మంది వివరాలను అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు గుర్తించిన మృతుల వివరాలు

1. గిడిజాల లక్ష్మి (35) - ఎస్. పి. రామచంద్రాపురం. - జి. సిగడాం మండలం. - శ్రీకాకుళం జిల్లా
2. కంచుజవరకి రవి (30) - తండ్రి పేరు చిన్నారావు - గోడికొమ్ము గ్రామం - జామి మండలం - విజయనగరం
3. చల్లా సతీశ్ (32) - తండ్రి పేరు చిరంజీవరావు (లేట్) - ప్రదీప్ నగర్, విజయనగరం జిల్లా
4. ఎస్.ఎం.ఎస్.రావు - రాయగడ పాసింజర్ లోకో పైలట్ - ఎన్ఏడీ, విశాఖపట్నం
5. కరణం అప్పలనాయుడు (45) - తండ్రి పేరు చిన్నయ్య - కాపుసంబాం గ్రామం - గరివిడి మండలం - విజయనగరం జిల్లా,
6. ఎం. శ్రీనివాస్ - విశాఖ-పలాస పాసింజర్ రైలు గార్డు
7. చింతల కృష్ణమనాయుడు (35),గ్యాంగ్‌మెన్ - దెందేరు గ్రామం, కొత్తవలస మండలం - విజయనగరం జిల్లా
8. రెడ్డి సీతంనాయుడు (43) - రెడ్డిపేట గ్రామం, చీపురుపల్లి మండలం - విజయనగరం జిల్లా
9. మజ్జి రాము (30) - గదబవలస గ్రామం - గరివిడి మండలం, విజయనగరం జిల్లా
10. పిల్లా నాగరాజు - కాపుసంబాం గ్రామం - గరివిడి మండలం - విజయనగరం జిల్లా
11. టెంకల సుగుణమ్మ -మెట్టవలస - జి.సిగడాం - శ్రీకాకుళం.






# మనం రాజనీతి మార్గంలో నడుద్దాం: లక్ష్మీనారాయణ



నంద్యాల: ప్రస్తుత రాజకీయాలపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. నంద్యాల జిల్లా నున్నిపెంట గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సంఘం వజ్రోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ప్రస్తుతం రాజనీతి శాస్త్రం.. రాజకీయ శాస్త్రంగా మరిందన్నారు. ఇప్పుడున్న రాజకీయాలు ప్రజలను ఏమార్చే రాజకీయాలుగా విశ్లేషించారు. రాజనీతిని నమ్ముకున్న వాళ్లం మనం.. మళ్లీ రాజనీతిని తీసుకురావడానికి ఇంకా చాలా కష్టపడాలని పూర్వ విద్యార్థుల సంఘానికి ఆయన సూచించారు.

"మన జీవితాలను ప్రభావితం చేసేది రాజకీయాలు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రాజకీయాలు నిర్ణయిస్తున్నాయి. మనకు రాజకీయాలకు సంబంధం లేదనుకుంటే అలాగే ఉండిపోతాం. రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మనం రాజనీతి మార్గంలో నడుద్దాం. అవసరమైనప్పుడు ఎక్కడ గొంతు వినిపించాలో అక్కడ వినిపిద్దాం. మనకు స్వార్థం లేదు, ఆస్తులు సంపాదించాలని ఆకాంక్ష లేదు. కేవలం ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే మన ధ్యేయం" అని లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు.


## పదవీ విరమణ శుభాకాంక్షలు



### శ్రీ దొంతుకుర్తి సూర్యనారాయణ మూర్తి (సూర్యం) గారు

2-10-1963వ తేదిన విశాఖపట్నం రైల్వే హాస్పిటల్‌లో శోభకృత్ నామ సంవత్సరంలో దొంతుకుర్తి వెంకటరావు, అప్పలనర్సమ్మ దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించిన మా సూర్యం "మాస్టర్ ఈకే గారి సంప్రదాయ పాఠశాల జనకులంలో బాల మేధావిగా పేరుతెచ్చుకున్నారు. 1984లో ఎంకాం పాసై 89లో పీజీ డిప్లమా చేసి, 1990లో ఆలిండియా రేడియోలో బీ గ్రేడ్ ఆర్టిస్టుగా సెలెక్ట్ అయి కళాకారుడిగా రాణిస్తూ 1995లో బీఎల్ డిగ్రీ పూర్తి చేశారు. 1983 ఆగస్టులో సాంస్కృతిక కళాకారుల కోటాలో జరిగిన పోటీలలో విజేతగా నిలిచి 1984 మే 2వ తేదీన జూనియర్ క్లర్క్‌గా రైల్వేలో ఉద్యోగం సంపాదించి 1984లోనే స్టెనో గ్రాఫర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం హెడ్ క్లర్క్‌గాన్, ఓఎస్‌టుగాను సీఎల్ టిఎస్ఓగాను పదోన్నతులు పొందారు. కళాకారుడుగా అత్యంత ప్రతిభా పాటవాలు పెంపొందించుకొని కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలోని స్వర్ణకమలం, సినిమాలో కూడా నటించారు. రావికొండలరావు స్థాపించిన విశాఖ హ్యూమర్ క్లబ్‌లో 15 సంవత్సరాలు సభ్యుడుగా ఉండి అనేక హాస్యరస కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్‌చే ఉత్తమ హాస్యనటుడుగా సత్కారం పొందారు. నా యిల్లు, నానూ సదువుకుంతాను, చివురంత ఆశ టెలీ ఫిల్మ్స్‌లో నటించారు. శృతిలయలు, సాహసమే జీవితం, ముత్యమంత ముద్దు సినిమాలలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారు.

నిత్యం ఉత్సాహంగా, ఉల్లాసంగా విధినిర్వహణను సమర్థవంతంగా నిర్వహిస్తూనే తోటి ఉద్యోగులందరినీ ప్రోత్సహిస్తూ వారిని వివిధ రకాలుగా ఆనందపరుస్తూ ఇంతకాలం మాతో ఉన్న సూర్యం నేడు పదవీ విరమణ చేసి రేపటి నుండి మాతో పనిచేయడు అనే భావం మమ్మల్ని బాధకు గురిచేస్తోంది.

సూర్యం లేకపోతే ఉత్సాహం ఉండదు.
సూర్యం లేకపోతే మంచి సలహాదారుడు లేనట్లే.
సూర్యం కనబడకపోతే తెలియని బెంగ మొదలవుతుంది.
సూర్యం ఉంటే ఎంతో ధైర్యంగాను, ధీమాగాను ఉంటుంది.

ఒక మంచి మిత్రుడు పదవీ విరమణ చేస్తుంటే, రేపటి నుండి ప్రతీరోజు అతడు మనతో ఉండడు అనుకుంటే కలిగే బాధఅంతా ఇంతా కాదు.
సూర్యం అందరి మనస్సులు దోచాడు. నవ్వుల రేడుగా, బాధ్యతగల స్నేహితుడుగా అతడి ఆత్మీయత నిరంతరం మనతోనే ఉంటుంది.
ఇక్కడే ఉంటాడనే ధైర్యం, పిలిచినప్పుడల్లా వస్తాడని నమ్మకం అతడికి వీడ్కోలు చెప్పేందుకు సహకరిస్తున్నాయి.

### శభాష్ సూర్యం..... నీతోనే మేమందరం.

ఇట్లు
సూర్యం మిత్రమండలి
డిఆర్ఎం కార్యాలయం
విశాఖపట్నం.



## శ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానం,

### విజయనగరం.

**శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవములలో ముఖ్యమైన పర్వదినములు**

| | |
|---|---|
| తే. 30-10-2023 ది. | తొలేళ్ల ఉత్సవము |
| తే. 31-10-2023 ది. | సిరిమాను ఉత్సవము |
| తే. 07-11-2023 ది. | తెప్పోత్సవము |
| తే. 14-11-2023 ది. | ఉయ్యాల కంబాల ఉత్సవము |
| తే. 15-11-2023 ది. | చండీ హోమం, పూర్ణాహుతి దీక్ష విరమణ (వనం గుడి వద్ద) |



**శ్రీ పైడితల్లి అమ్మవారి నిత్య అన్నదాన పథకం**

| | |
|---|---|
| 1. రూ. 5,116/-లు సమర్పించినచో దానిపైన వచ్చు వడ్డీతో సం.లో ఒకరోజున | 25 మందికి అన్నదానం |
| 2. రూ. 2,116/-లు సమర్పించినచో దానిపైన వచ్చు వడ్డీతో సం.లో ఒకరోజున | 10 మందికి అన్నదానం |
| 3. రూ. 1,116/- సమర్పించినచో దానిపైన వచ్చు వడ్డీతో సం.లో ఒకరోజున | 5 మందికి అన్నదానం |
| 4. రూ. 200/-లు చిట్లించినవారములో ఒకరోజు | 10 మందికి అన్నదానం |
| 5. రూ. 100/-లు చిట్లించినవారములో ఒకరోజు | 5 మందికి అన్నదానం |

విరాళములు స్వయముగా గానీ, మనియార్డరు బ్యాంకు డి.డి. ద్వారా శ్రీ కార్యనిర్వహణాధికారి, శ్రీ పైడిపల్లి అమ్మవారి దేవస్థానం, విజయనగరం వారి పేరున గాని, ఆన్లైన్ (కేనరా బ్యాంకు అకౌంట్ నెం. 35812200022986 IFSC CODE CNRB 0013581) ద్వారా కానీ చెల్లించి రశీదు పొందవచ్చును.

గమనిక - రూ.5,116/-లు లేదా అంత కంటే ఎక్కువ విరాళము చెల్లించినవారికి 10 సంవత్సరముల వరకు మాత్రమే అన్నదానం ఇంటిమేషన్లు పంపబడును.

గమనిక: ఆన్‌లైన్ ద్వారా పై పూజలు చేయించుకొనుటకు గాను భక్తులు aptemples.ap.gov.in అను వెబ్ సైట్ ద్వారా గానీ లేదా HDFC A/c No. 50100431529656 IFSC Code: HDFC0000744కు పై రుసుములను చెల్లించి శ్రీ అమ్మవారి కృపకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

ఈ-హుండీ చెల్లింపు కొరకు:- ap temples.ap.gov.in అను వెబ్సైట్ ద్వారా గానీ లేదా Union Bank A/c No. 060910100027235 IFSC Code: UBIN0806099కు చెల్లించవలసినదిగా కోరడమైనది.

ఈ-డొనేషన్ చెల్లింపు కొరకు:- aptemples.ap.gov.in అను వెబ్సైట్ ద్వారా గానీ లేదా HDFC A/c No.50100431529656 IFSC Code: HDFC0000744కు చెల్లించవలసినదిగా కోరడమైనది.

గౌ.శ్రీ పి.అశోక్ గజపతిరాజు గారు,
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్-ఛైర్మన్
మరియు ధర్మకర్తల మండలి సభ్యులు.
మరియు ప్రత్యేక ఆహ్వానితులు

సహాయ కమిషనరు మరియు
కార్యనిర్వహణాధికారిణి.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, ,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676